


నగరానికి పొగ

కనుచూపు మేరలో కొండలు.. పచ్చ పచ్చని వృక్షాలు.. కమ్ముకున్న పొగమంచు.. కశ్మీరులోయ అందాలను తలపిస్తున్నాయి కదా..? కనిపించేదంతా నిజం కాదు..! ఇది డంపింగ్ యార్డు చిమ్ముతున్న విషం..!

గుత్తి రోడ్డు డంపింగ్ యార్డు నుంచి విష వాయువులు రోజూ ఇలా అనంతపురం నగరాన్ని కమ్మేస్తున్నాయి. దట్టమైన పొగ, దుర్వాసన కారణంగా గుత్తి రోడ్డు వెళ్లే వాహనదారులు శుక్రవారం సాయంత్రం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముక్కులు మూసుకుని వేగంగా అక్కడి నుంచి బయట పడేందుకు ప్రయత్నించారు. ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించనంత పొగ అలుముకుంది. వేల టన్నుల చెత్త పేరుకుపోవడం, తరచూ నిప్పు అంటుకోవడంతో ఈ సమస్య తలెత్తుతోంది. చుట్టుపక్కలవారు రోగాలబారిన పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు వీలైనంత త్వరగా ప్రత్యామ్నాయం చూడాలని కోరుతున్నారు.

- అనంతపురం క్రైం







నామినేటెడ్ న్యాయం..!



పోరాటాల వీరులకు ప్రాధాన్యం

టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో నామినేటెడ్ పదవుల పంపకానికి అధినాయకత్వాలు సిద్ధమయ్యాయి. శ్రమ జీవులు, పోరాటాల వీరులకు న్యాయం జరిగే రోజులు వచ్చాయి. జాబితాల రూపకల్పన ప్రక్రియ మొదలైంది. వైసీపీ హయాంలో ఎవరెవరు ఇబ్బందులు ఎదుర్కొన్నారు..? పార్టీ కోసం ఎంతగా కష్టపడ్డారు..? ఎన్ని కేసులను భరిస్తున్నారు..? శ్రేణులకు ఏ స్థాయిలో ఉండగా నిలిచారు..? ఎలాంటి త్యాగాలు చేశారు..? ఈ ప్రశ్నలకు జవాబులే ప్రాతిపదికగా జాబితాలు తయారవుతున్నాయి. అందులో తమ పేరు ఉండాలని, కుర్చీ తమకే దక్కాలని ఆశావహులు ప్రయత్నాలను ప్రారంభించారు.

- ఒక్కో నియోజకవర్గం నుంచి 20 పేర్లు
- వేర్వేరుగా ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడి జాబితాలు
- యువనేత, మంత్రి లోకేశ్ నిఘా బృందం మరో జాబితా
- నాలుగింటి వడపోత తరువాత.. నియామక ప్రక్రియ
- ఆశావహుల్లో హుషారు.. ముమ్మరంగా ప్రయత్నాలు



అనంతపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల పంపకానికి కూటమి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. నామినేటెడ్ పదవులు దక్కించుకునేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. మూడు పార్టీల అధినాయకత్వాల ఆదేశాలు, సూచనలకు అనుగుణంగా నామినేటెడ్ పదవులకు అర్హులను ఎంపిక చేసే విషయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు ఆచితూచి అడుగు వేయాల్సి వస్తోంది. పార్టీ కోసం పనిచేసినవారికి, మరీ ముఖ్యంగా వైసీపీ పాలనలో అరాచకాలు, దౌర్జన్యాలకు ఎదురొడ్డి నిలిచినవారికి, ఈ క్రమంలో ఆర్థికంగా, రాజకీయంగా, కేసులపరంగా ఇబ్బందులు ఎదుర్కొన్నవారికి పెద్దపీట వేయాలని మూడు పార్టీలు భావిస్తున్నాయి. ఆ దిశగా ఇప్పటికే స్పష్టమైన సంకేతాలను పంపినట్లు సమాచారం. తెలుగుదేశం పార్టీలో బాధిత వర్గాలను నామినేటెడ్ పదవులతో సంతృప్తిపరచాలని పార్టీ అధినాయకత్వం భావిస్తోంది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ దిశగా ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం.

వేర్వేరు జాబితాలు..



వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనలో అనేక రకాలుగా ఇబ్బందులు పడిన నాయకులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని యువగళం సారథి నారా లోకేశ్ భావిస్తున్నారని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. జిల్లాలో పాదయాత్ర చేసిన సమయంలో వైసీపీ దౌర్జన్యాలు, అరాచకాలకు బెదరకుండా పార్టీ శ్రేణుల్లో ధైర్యాన్ని నింపినవారికి ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచనలో యువనేత ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షుడి ద్వారా నామినేటెడ్ పదవులకు వేర్వేరు జాబితాలు తయారు చేయించాలని పార్టీ అధినాయకత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఈ పని మొదలైనట్లు తెలిసింది. ఈ మూడు జాబితాలకు తోడు నారా లోకేశ్ నేతృత్వంలోని నిఘా బృందం ఇచ్చే జాబితా కీలకంగా మారే అవకాశం ఉంది. జాబితాల వడపోత తరువాత నామినేటెడ్ పోస్టుల పంపకాలు జరుగుతాయని తెలిసింది. ముందుగా రాష్ట్రస్థాయి చైర్మన్ పోస్టులు, తరువాత జిల్లాస్థాయి పోస్టులను భర్తీ చేస్తారని పార్టీ ముఖ్యుల ద్వారా తెలిసింది.

నియోజకవర్గానికి 20 పేర్లు..



నామినేటెడ్ పదవులను భర్తీ చేసే క్రమంలో ఒక్కో నియోజకవర్గం నుంచి 20 మంది పేర్లను పరిగణలోకి తీసుకుంటున్నారు. ఆ బాధ్యతలను ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు అధినాయకత్వం అప్పగించినట్లు తెలిసింది. పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్న నాయకులతో పాటు.. వైసీపీ అరాచక పాలనలో అక్రమ కేసులతో ఇబ్బందిపడిన, ఆర్థికంగా నష్టపోయిన నాయకులను గుర్తించి.. జాబితా తయారు చేయాలని పార్టీ అధిష్ఠానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఎమ్మెల్యేలు ఆచితూచి జాబితాను తయారు చేస్తున్నారని సమాచారం. ఎంపీలు సైతం అదే పనిలో ఉన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడి నుంచి ప్రత్యేకంగా జాబితాను తయారు చేయిస్తున్నారని తెలిసింది. మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన నిఘా బృందం కూడా జాబితాలను రూపొందిస్తోంది. పార్టీలో దశాబ్దాలుగా పనిచేస్తున్న ముఖ్య నాయకులు, ఇదివరకు ఎలాంటి నామినేటెడ్ పదవులు దక్కని నాయకులు, వైసీపీ బాధితులు, టీడీపీ అనుబంధ సంఘాల్లో పనిచేస్తున్న నాయకులను పరిగణలోకి తీసుకుంటున్నారు. వైసీపీ పాలనలో పదుల సంఖ్యలో కేసులు నమోదైనా.. పచ్చజెండాను వీడని వారికి నామినేటెడ్ పదవులు ఇచ్చి న్యాయం చేయాలని నారా లోకేశ్ భావిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఆశీస్సుల కోసం..

వైసీపీ అరాచక పాలనలో ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి.. టీడీపీని అధికారంలోకి తీసుకురావాలన్న ఏకైక లక్ష్యంతో పనిచేసిన నాయకులు తమకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నారు. నామినేటెడ్ పదవులు ఆశించే నాయకులు ఎమ్మెల్యేల ఆశీస్సుల కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలోనూ కొందరు నేతల అభయ హస్తం కోసం ప్రయత్నిస్తున్నారు. పార్టీలోని వివిధ సామాజికవర్గాల ముఖ్య నాయకులను కొందరు ప్రసన్నం చేసుకుంటున్నారు. జిల్లాలో ముఖ్య నేతల ఆశీస్సులు అందకపోయినా.. కొందరు నేరుగా టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద కు, పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి మంత్రి నారా లోకేశ్ వద్దకు నేరుగా వెళుతున్నారు. నామినేటెడ్ పదవుల కోసం బయోడేటాలను సమర్పిస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా అహుడా, ఏడీసీసీ, ఏపీఐఐసీ, ఆగ్రోస్, ఆర్టీసీ రీజినల్ చైర్మన్ పదవులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల చైర్మన్ పదవుల కోసం పోటీ పడుతున్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో సామాజికవర్గాల వారీగా సమన్యాయం చేయాలనే యోచనలో పార్టీ అధినాయకత్వం ఉంది. ఈ నేపథ్యంలో పదవులు ఎవరిని వరిస్తాయోనన్న చర్చ జరుగుతోంది.

మామిడి మొక్కల నరికివేత

వీరన్నపల్లిలో వైసీపీ దుశ్చర్య



నరికివేసిన మామిడిమొక్కలు

పెద్దవడుగూరు, జూలై 19: మండల పరిధిలోని వీరన్నపల్లి గ్రామంలో టీడీపీ వర్గీయుల మామిడి మొక్కలను వైసీపీ వర్గీయులు నరికేశారు. రెడ్డప్పరెడ్డి, భరత్‌కుమార్ సోదరుల తోటలో మూడేళ్ల వయసుగల 120 మామిడి మొక్కలను గురువారం అర్ధరాత్రి నరికేశారు. తామిద్దరం గురువారం రాత్రి తోట వద్దకు వెళ్లామని, ఆ సమయంలో తమ గ్రామానికి చెందిన వైసీపీ వర్గీయులు గోపాల్, శ్రీనివాసులు, రాఘవేంద్ర, శ్రావణ్‌కుమార్, నాగభూషణ్, వెంకటస్వామి కేకలు వేసుకుంటూ దాడికి ప్రయత్నించారని బాధితులు తెలిపారు. తాము ప్రాణ భయంతో పరుగులు తీశామని, వారిని అడ్డుకున్న దళితుడు నరేష్‌పై దాడిచేశారని తెలిపారు. బాధితుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశామని సీఐ రోషన్ తెలిపారు.

ఆటవిక చర్య: ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పండ్ల మొక్కలను నరకడం అటవిక చర్య అని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి అన్నారు. వీరన్నపల్లికి ఎమ్మెల్యే శుక్రవారం వెళ్లి బాధితులతో మాట్లాడారు. నరికివేసిన మొక్కలను పరిశీలించారు. దోషులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐని ఆదేశించారు. అండగా ఉంటామని బాధిత రైతులకు భరోసా ఇచ్చారు.

కుళ్లాయిస్వామి చివరి దర్శనం



చివరి దర్శనం కోసం వేచివున్న భక్తులు

నార్పల, జూలై 19: గూగూడు కుళ్లాయి స్వామి చివరి దర్శనం వేడుకను శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం రెడ్డి వంశీయులు కుళ్లాయిస్వామి పీరును ఆలయం వెలుపలకు తీసుకువచ్చి, గంటపాటు భక్తులకు దర్శనం కల్పించారు. కుళ్లాయిస్వామి గోవిందా గోవింద అంటూ భక్తులు గోవింద నామస్మరణం చేశారు. స్వామివారి చివరి దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున గూగూడుకు తరలివచ్చారు. అనంతరం కుళ్లాయిస్వామి పీరును మకానంలో ఉన్న పెట్టెలో భద్రపరిచారు. వచ్చే బ్రహ్మోత్సవాల వరకు స్వామి పీరును బయటకు తీయబోమని ముజావర్ హుసేనప్ప తెలిపారు. అంతటితో కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఈఓ శోభ, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు జాఫర్‌వలి, రాజన్న, కుళ్లాయప్ప, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



కుళ్లాయిస్వామిని చూపిస్తున్న ముజావర్లు

పెద్దారెడ్డిని జిల్లా నుంచి బహిష్కరించాలి

ఆయన తాడిపత్రికి వస్తే పంచె విప్పి కొడతా : జేసీ ప్రభాకర్ రెడ్డి వార్నింగ్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, జూలై 19: మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రిలోకి అడుగు పెడితే పంచె విప్పి కొడతామని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. గెలిచినా, ఓడినా ఫ్యాక్షన్ మొదలు పెడతానని పెద్దారెడ్డి బహిరంగంగా చెప్పినా పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పెద్దారెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందని, ఆయనతోపాటు ఆయన ఇద్దరు కొడుకులను జిల్లా నుంచి బహిష్కరించాలని డిమాండ్ చశారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులే వైసీపీ హయాంలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. తనను జామీను ఇవ్వాలని, లేదంటే అరెస్టు చేస్తామని డీఎస్పీ జనార్దన్‌నాయుడు తమ లాయర్‌కు చెప్పారని, చేతనైతే అరెస్టు చేయాలని సవాలు విసిరారు. తనను డీఎస్పీ అరెస్టు చేస్తే ఎవరో ఒకరు జామీను ఇస్తారని, లేదంటే లోపలే ఉంటానని అన్నారు. పోలింగ్ తరువాత పెద్దారెడ్డి తమ పార్టీ నాయకుడు సూర్యముని ఇంటికి వెళ్లి దౌర్జన్యం చేస్తే.. పోలీసులు దగ్గరుండి కాపలా కాయడం ఏమిటని ప్రశ్నించారు. పెద్దారెడ్డిపై ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. శాంతిభద్రతలను కాపాడేందుకే తమ ఇంటిచుట్టూ పోలీసులను పెట్టామని ఎస్పీ గౌతమిశాలి చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. పెద్దవడుగూరు మండలంలో టీడీపీ నాయకుడు రెడ్డప్పరెడ్డి మామిడిచెట్లను వైసీపీ మద్దతుదారులు నరికివేస్తే పోలీసులు కనీసం ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని అన్నారు. తాడిపత్రిలో తమకు శత్రువులు ఎవరూ లేరని, వైసీపీకి చెందిన ఎవరిపైనా కక్ష లేదని అన్నారు. కానీ వారిలో ఐదుగురిపై మాత్రం చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి తన కుమారుడు జేసీ అశ్మిత్‌రెడ్డిని మరో 20 ఏళ్లపాటు ఎమ్మెల్యేగా చూడాలని అనుకుంటున్నానని అన్నారు. గతంలో ఒకరిద్దరి కోసం తమ ఊరిలో పండుగకు అనుమతులు ఇచ్చినట్లు ఇచ్చి వెనక్కి తీసుకున్నారని, ఇప్పుడు ఏ పండుగ అయినా అనుమతులు తీసుకోబోమని, సమాచారం మాత్రమే ఇస్తామని అన్నారు. గడిచిన ఐదేళ్లు చట్టం అమలు కాలేదని, ఇప్పుడు అలా కుదరదని అన్నారు. తాను ఎవరికీ హాని చేయాలని అనుకోవడం లేదని స్పష్టం చేశారు. వైసీపీలో ఆర్థిక పరిస్థితి బాగాలేనివారు వస్తే మంచి చేయడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. బస్సులను సీజ్ చేసిన విషయంలో తనకు న్యాయం చేయాలని పదిరోజులు గడువు ఇచ్చానని, కానీ ఇప్పటివరకు అధికారుల నుంచి సమాధానం రాలేదని అన్నారు. అప్పటి రవాణాశాఖ మంత్రి పేర్నినాని, కమిషనర్ సీతారామాంజనేయులు, డీటీసీ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డితోపాటు ఆయన కుమారులపై ఫిర్యాదు చేయడానికి ఈ నెల 24న అనంతపురానికి వెళతానని తెలిపారు. కేసు నమోదు చేసేవరకు అక్కడే బైఠాయిస్తానని అన్నారు.

ర్యాగింగ్‌కు స్వస్తి పలకండి

న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్



మాట్లాడుతున్న న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్

అనంతపురం క్రైం, జూలై 19: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి తమ భవిష్యత్తును కోల్పోవద్దని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ సూచించారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ప్రసంగించారు. రోడ్డు నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాలను నివారించాలని సూచించారు. ర్యాగింగ్ నిరోధక చట్టంలోని అంశాలను శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు వివరించారు. ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భక్తవత్సలం, ట్రాఫిక్ సీఐ నారాయణరెడ్డి, మధ్యవర్తిత్వ కేంద్ర సభ్యుడు, న్యాయవాది హరికృష్ణ, చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ ఇటికె నల్లప్ప, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలు కురుస్తాయ్.. జాగ్రత్త

జేసీ కేతన్ గార్గ్



సమీక్షలో మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం టౌన్, జూలై 19: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జేసీ కేతన్‌గార్గ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వర్షాలపై జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మండలస్థాయి రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లుతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. రానున్న రోజులలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అన్ని శాఖల ఉద్యోగులు అందుబాటులో ఉండాలని సూచించారు. రెవెన్యూ డివిజినల్, మండల, గ్రామస్థాయి అధికారులందరినీ అప్రమత్తంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను, పాఠశాలలను గుర్తించి, అక్కడ ఎవరూ ఉండకుండా చూడాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో దండోరా వేయించాలని సూచించారు. పశువులు, మేకలను వాగులు, వంకల వద్దకు వెళ్లకుండా చూడాలని అన్నారు. ధాన్యం వర్షాలకు తడవకుండా భద్రపరుచుకునేలా రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు. చెరువులకు గండ్లు పడే ప్రమాదం ఉంటే.. ఇసుక బస్తాలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. సీజినల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించాలని సూచించారు. సమీక్షలో నగరపాలిక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్వో రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్: కలెక్టర్

భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ చెప్పిన నేపథ్యంలో జిల్లాలో మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులను కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ శుక్రవారం ఆదేశించారు. నీటి ప్రవాహ ప్రాంతాల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షం కురిసే సమయంలో పిడుగులు పడే ప్రమాదం ఉంటుందని, ఆ సమయంలో చెట్లు, టవర్స్ దగ్గర ఉండకూడదని, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. వర్షాల వల్ల ఎక్కడ ఏ సమస్య వచ్చినా వెంటనే చర్యలు తీసుకోవడానికి కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. సమస్యలు తలెత్తితే 8500292992, 08554-220009 నంబర్లను ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు.

అభివృద్ధి ఏదీ ?

ఆదాయంపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై ఎందుకు లేదు?

నేమకల్లు అంజన్న ఆలయ అధికారులను నిలదీసిన గ్రామస్థులు

హైడ్రామా మధ్య టెంకాయల అమ్మకం వేలం వాయిదా

బొమ్మనహాళ్, జూలై 19: ఆదాయాన్ని తీసుకెళ్తున్నారు గానీ ఆలయాన్ని అభివృద్ధి చేయడం లేదని గ్రామస్థులు దేవదాయ అధికారులను నిలదీసిన సంఘటన మండలంలోని నేమకల్లులో జరిగింది. ప్రసిద్ధి చెందిన ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం టెంకాయల అమ్మకం వేలం పాట నిర్వహించాలని ప్రయత్నించారు. ప్రారంభంలోనే దేవాలయ నిధులలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. దేవాలయానికి ఏడాదికి రూ. 50 లక్షలకుపైగా ఆదాయం ఉందని, ఎందుకు అభివృద్ధి చేయడం లేదని గ్రామస్థులు అధికారులను నిలదీశారు. ప్రతి ఏటా హుండీ, టెంకాయలు, లడ్డూ, రూముల ద్వారా వచ్చే ఆదాయాన్ని తీసుకెళ్లడమే గాని ఆలయ అభివృద్ధికి ఏం చర్యలు తీసుకున్నారని మండిపడ్డారు. కొన్నేళ్లుగా మరుగుదొడ్లు, బాత్రూంలలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని విన్నవిస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఈఓ నరసింహారెడ్డి మాట్లాడుతూ ఇక్కడ ఉన్న గుమాస్తా సమస్యల గురించి తనకు చెప్పలేదన్నారు. దీంతో డబ్బులిస్తేనే కదా పనులు చేయించేది అని గుమాస్తా ఓబన్న బదులిచ్చాడు. ఈక్రమంలో రాయదుర్గం జూనియర్ అసిస్టెంట్ జితేంద్ర, ఓబన్నల మధ్య వాగ్వాదం జరిగింది. గుమాస్తా ఓబన్న దేవాలయ సమస్యలపై పట్టించుకోవడం లేదని, ఆలయంలో రెండేళ్ల కిందట బియ్యం చోరీ అయినా పట్టించుకోలేదని, దేవాలయ ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆయన్ను తొలగించాలని కొందరు గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఎవరు ఎంతెంత సొమ్ము తిన్నారో? లెక్కలు బయట పెడతానని ఓబన్న అనడంతో కొందరు జోక్యం చేసుకుని కప్పిపుచ్చారు. అధికారుల హైడ్రామా మధ్య టెంకాయలు అమ్మకం వేలం పాట నిర్వహించారు. గత ఏడాది రూ. 6.20 లక్షలకు పాడగా ఈ ఏడాది రూ. 4.80 లక్షలకే పాట పాడటంతో వేలం వాయిదా వేశారు. కాగా ఆలయానికి ఎదురుగా ఉన్న 10 గదుల్లో 8 గదులు వేలం పాట నిర్వహించారు. ఇందులో రెండు వాయిదా పడినట్లు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రాణి, ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. ఎనిమిది గదులకు రూ. 20 వేలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. గదులకు డిమాండ్ లేకపోవడంతో తూతూ మంత్రంగా జరిపి మమ అనిపించారు.



దేవాలయ సమస్యలపై నిలదీస్తున్న గ్రామస్థులు

24 నుంచి మున్సిపల్ వర్కర్ల రాష్ట్ర సదస్సులు

అనంతపురం విద్య, జూలై 19: ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వైజ్ఞానిక శిక్షణా సదస్సులు ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆ సంఘం జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ మదనపల్లి సమీపంలోని హార్సీలీ హిల్స్‌లో ఈ సదస్సులు ఉంటాయన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు జరపాలన్నారు. పోయిన సమ్మె కాలంలో చేసిన డిమాండ్ల ఇప్పటికీ నెరవేరలేదన్నారు. మున్సిపాలిటీల్లో ఈపీఎఫ్, ఈఎస్ఐ తదితర సమస్యలు నేటికీ అలాగే ఉన్నాయన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే కార్మికుల వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పర్మినెంట్ కార్మికుల సరెండర్ లీవ్స్ బకాయి ఉన్న డీఏలు వెంటనే ఇవ్వాలని కోరారు. మున్సిపల్ స్కూళ్లలో పనిచేసే స్వీపర్లు, వాచ్‌మెన్లకు వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి రాజేష్ గౌడ్, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, ఇతర నాయకులు వేణు, కొండయ్య, నాగేంద్రబాబు, నాగరాజు, కుల్లాయి రెడ్డి, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

అధికారులదే బాధ్యత

- గ్యాంగ్ ఉద్యోగి ఆత్మహత్యకు కారకులపై చర్యలు తీసుకోవాలి
- ఎంప్లాయిస్ సంఘ్ డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్

గుంతకల్లు, జూలై 19: వేధింపులకు పాల్పడి గ్యాంగ్‌మన్ హరి ఓం నారాయణ్ మృతికి కారణమైన రైల్వే అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంప్లాయిస్ సంఘ్ డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్ డిమాండ్ చేశారు. హరి ఓం నారాయణ్ అనే బిహార్‌కు చెందిన గ్యాంగ్ ఉద్యోగి ఉన్నతాధికారుల వేధింపుల తాళలేక ఈ నెల 15న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కానీ అతడి వద్ద ధ్రువీకరణ పత్రాలేవీ లభించనందున గుర్తుతెలియని వ్యక్తి మృతిగా పోలీసులు కేసును నమోదుచేశారు. నాలుగు రోజుల కిందట గ్యాంగ్ ఉద్యోగి హరి ఓం నారాయణ్ అదృశ్యం కావడంపై అతడి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రైలు కిందపడి మరణించిన వ్యక్తి ఫొటోలను చూసి అతడు హరి ఓం నారాయణ్‌గా సహోద్యోగులు గుర్తుపట్టారు. హరి ఓం ఉన్నతాధికారుల వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తూ శుక్రవారం ఉదయం సీనియర్ సెక్షన్ ఇంజనీరు పీ-వే (బ్రాడ్‌గేజ్) కార్యాలయం ఎదుట ఈ విభాగానికి చెందిన గ్యాంగ్ సిబ్బంది ఆందోళన నిర్వహించారు. అనంతరం డీఆర్‌ఎం కార్యాలయం వద్దకు వచ్చి ధర్నా నిర్వహించారు. వీరి ఆందోళనకు మద్దతునిచ్చిన సంఘ్ డివిజనల్ కార్యదర్శి మాట్లాడుతూ పీ-వే (బీ.జీ.) విభాగంలోని సీనియర్ సెక్షన్ ఇంజనీర్లయిన సంతోష్ కుమార్, శశికుమార్ యాదవ్ గ్యాంగ్ సిబ్బందిని వేధిస్తున్నారని, వారి వేధింపుల వల్లే గ్యాంగ్‌మన్ హరి ఓం బలవన్మరణానికి ఒడిగట్టాడని ఆరోపించారు. వారిద్దరిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ ఎస్‌అండ్‌టీ/ఇంజనీరింగ్ విభాగం యూనియన్ కార్యదర్శి డీ రాజ్ కుమార్, గ్యాంగ్‌మెన్, తదితరులు పాల్గొన్నారు.



గ్యాంగ్‌మెన్ ధర్నాలో మాట్లాడుతున్న సంఘ్ డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్

అప్పులబాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య



నీరుగుట్ట నారాయణస్వామి (ఫైల్)

ధర్మవరం, జూలై 19: అప్పుల బాధతో పట్టణంలోని శివానగర్‌లో ఓ చేనేత కార్మికుడు శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు.. శివానగర్‌కు చెందిన నీరుగుట్ట నారాయణస్వామి(43) రెండు మగ్గాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగించేవాడు. ఈయనకు భార్య లక్ష్మీదేవి, కుమారుడు అనిల్‌కుమార్, కుమార్తె ప్రణతి ఉన్నారు. కొన్నేళ్ల కిందటి వరకూ బాగున్న చేనేత పరిశ్రమ కరోనా తరువాత కుదేలవుతూ వచ్చింది. దీనికి తోడు ముడిసరుకుల ధరలు రెట్టింపు కావడం, నేసిన చీరలకు గిట్టుబాటు లేకపోవడంతో కుటుంబపోషణ భారమైంది. ముడిసరుకులు, పిల్లల చదువులు, కుటుంబపోషణ కోసం దాదాపు రూ.ఆరు లక్షల దాకా అప్పులు చేశాడు. వీటిని ఎలా తీర్చాలో తోచక తరచూ తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడు. మొహరం పండుగ కోసం తన పుట్టిళ్లు అయిన ముదిగుబ్బ మండలం సీసీరేవుగ్రామానికి పిల్లలను తీసుకుని భార్య వెళ్లింది. ఇంటిలో ఎవరూ లేకపోవడంతో శుక్రవారం తెల్లవారుజామున ఉరి వేసుకుని ఆత్మహత్యకు ఒడిగట్టాడు. ఉదయం కుమారుడు అనిల్‌కుమార్ సీసీరేవు గ్రామం నుంచి ధర్మవరం వచ్చాడు. ఇంటి తలుపులు తెరవగానే తండ్రి ఉరికి వేలాడుతూ కనిపించడంతో బోరున విలపించడంతో పక్కనే ఉన్న మృతుడి అన్న, బంధువులు అక్కడికి వచ్చారు. ఉరికి వేలాడుతున్న నారాయణస్వామిని కిందకు దించారు. వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి పరిశీలించి, మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జాతీయ చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 19: జాతీయ చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారులు కుషాల్, శ్రీహ అర్హత సాధించారు. నంద్యాలలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఏపీ రాష్ట్ర జూనియర్ అండర్-19, ఓపెన్ బాలికల చెస్ చాంపియన్‌షిప్-2024పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. అండర్-19 ఓపెన్ విభాగంలో మొత్తం 151మంది క్రీడాకారులు పాల్గొనగా జిల్లాకు చెందిన కుషాల్ టైటిల్ కైవసం చేసుకున్నాడు. బాలికల విభాగంలో శ్రీహ తృతీయ స్థానం సాధించింది. ఇద్దరు క్రీడాకారులు సెప్టెంబరులో నిర్వహించే జాతీయ స్థాయి చెస్ పోటీలకు అర్హత సాధించారని ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, ఉదయ్‌కుమార్ నాయుడు, గౌరవాధ్యక్షుడు బాలరాజులు అభినందనలు తెలిపారు.

రైళ్ల దారి మళ్లింపు



గుంతకల్లు, జూలై 19: అనంతపురం-గుంతకల్లు మీదుగా వెళ్లే రెండు రైళ్లను దారి మళ్లించనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లోకమాన్య తిలక్ టెర్మినస్ (ముంబై) - కోయంబత్తూరు మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ (నెం. 11013) రైలును ఈ నెల 29న, ఆగస్టు 5, 12 తేదీల్లో బెంగళూరు ఈస్ట్, బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్ల మీదుగా కాకుండా గౌరీబిదనూరు, బయ్యపనహళ్లి, హోసూరు స్టేషన్ల మీదుగా మళ్లిస్తున్నట్లు తెలిపారు. అలాగే కేఎస్ఆర్ బెంగళూరు-నాందేడ్ డెయిలీ ఎక్స్‌ప్రెస్ (నెం. 16593)ను ఈ నెల 30, ఆగస్టు 6, 13 తేదీల్లో కేఎస్ఆర్ బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్ మీదుగా కాకుండా, బెంగళూరు యశ్వంతపూర్, యల్హంక స్టేషన్ల మీదుగా మళ్లించనున్నట్లు తెలిపారు. అలాగే ఈ రైలు రాత్రి 11-20 గంటలకు కాకుండా, అర్ధరాత్రి 12-45 గంటలకు బయల్దేరుతుందన్నారు. అదేవిధంగా ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్-కేఎస్ఆర్ బెంగళూరు మధ్యన నడిచే ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్ (నెం. 11301) రైలును ఈనెల 30, ఆగస్టు 6, 13 తేదీల్లో ఆలస్యంగా నడపనున్నట్లు తెలిపారు.

నీటి పంపింగ్‌కు చర్యలు చేపట్టండి: కేశవ్

ఉరవకొండ, జూలై 19: నియోజకవర్గంలోని ఎస్ఎస్ ట్యాంక్‌లోకి నీటిని పంపింగ్ చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించారు. విజయవాడ నుంచి ఆయన కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎస్ఎస్ ట్యాంక్‌లు ఎండిపోయాయని, తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్‌కు తెలిపారు. హెచ్చెల్సీకి నీరు విడుదల కానున్న నేపథ్యంలో నింబగల్లు, విడపనకల్లు, గడేకల్లు, కొనకొండ్ల గ్రామాల వద్దనున్న ఎస్ఎస్ ట్యాంకులను నింపాలని సూచించారు. ఆ దిశగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించాలని కలెక్టర్‌కు సూచించారు. ఈ ట్యాంకులపై ఆధారపడిన గ్రామాలకు వెంటనే తాగునీరు సరఫరా చేయాలని సూచించారు. నీటి పంపింగ్ తాను స్వయంగా పర్యవేక్షిస్తానని మంత్రికి కలెక్టర్ తెలిపారు.

హెచ్చెల్సీపై అధికారుల పర్యటన

కణేకల్లు, జూలై 19: తుంగభద్ర ఎగువ కాలువను కర్ణాటక, ఆంధ్ర అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. కర్ణాటకలోని 23వ కి.మీ. నుంచి ఆంధ్ర సరిహద్దు 105 కి.మీ. వరకు కాలువ పరిస్థితిని వారు శుక్రవారం పరిశీలించారు. తుంగభద్ర డ్యాం కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఈఈ రవిచంద్ర, ఎస్‌డీఈలు నందాని, గోపీతో పాటు ఆంధ్ర హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్, ఈఈ వెంకట్రామిరెడ్డి కాలువ లైనింగ్, ఎస్కేప్ చానళ్ల పరిస్థితి, అండర్ టన్నెల్, రివిట్‌మెంట్ తదితరాలను పరిశీలించారు. ఈ నెల 22న హెచ్చెల్సీకి నీరు విడుదల చేస్తున్న నేపథ్యంలో కాలువల పరిస్థితిని పరిశీలించారు. జిల్లాలో హెచ్చెల్సీ నీటిని తాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యం కింద వినియోగిస్తామని అధికారులు తెలిపారు. ఆగస్టులో ఐవీబీ సమావేశాన్ని నిర్వహించే అవకాశం ఉందని అన్నారు. కాగా టీబీ డ్యాంకు శుక్రవారం లక్ష క్యూసెక్కులకు పైగా వరద నమోదైంది.

దారి తప్పిన నిధులు

- గ్రామీణ రోడ్ల అభివృద్ధి నిధులు పక్కదారి
- ఐదేళ్లలో 25 శాతం పనులు చేయని వైసీపీ
- బ్యాంకు లోన్ నిధులు సైతం మళ్లింపు
- రాష్ట్ర వాటాను ఇవ్వని గత ప్రభుత్వం
- అధ్వానరోడ్లపై గ్రామీణ ప్రజల అవస్థలు

అనంతపురం సిటీ, జూలై 19: గత వైసీపీ ప్రభుత్వం గ్రామీణ రహదారులను ఏమాత్రం పట్టించుకోకపోవడంతో అవి ఛిద్రమయ్యాయి. దీంతో పల్లె ప్రజలు ప్రయాణానికి ఎన్నో అవస్థలు పడ్డారు. రోడ్ల అభివృద్ధి కోసం కేంద్రం ఇచ్చిన నిధులను సైతం జగన్ సర్కార్ పక్కదారి పట్టించింది. అధికారిక లెక్కల ప్రకారం గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం గ్రామీణ రోడ్ల పనులను కనీసం 25శాతం కూడా చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పనులు చేసిన కాంట్రాక్టర్లకు కూడా రూ.కోట్లలో బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. దీంతో వారు బిల్లుల కోసం గగ్గోలు పెడుతున్నారు.



జిల్లా పంచాయతీరాజ్‌శాఖ కార్యాలయం

ఐదేళ్లలో చేసిందీ.. 25శాతమే

గ్రామీణ రోడ్ల అభివృద్ధి కోసం అధికార లెక్కల ప్రకారం 2018-19లో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు నిధులు మంజూరు చేసింది. 138 గ్రామీణ రోడ్లను రూ.268 కోట్లతో అభివృద్ధి చేయాల్సి ఉంది. కాగా ఈ రోడ్లకు 70:30 వాటాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధు లు సమకూర్చాల్సి ఉంది. అయితే కేంద్ర ప్రభుత్వం ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు ద్వారా రుణం కింద తన వాటా నిధులను మంజూరు చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా 30శాతం నిధులు ఇవ్వకపోగా కేంద్రం నుంచి వచ్చిన నిధులను సైతం ఇతర ప్రభుత్వం పథకాలకు మళ్లించింది. దీంతో అభివృద్ధి లేక గ్రామీణ రోడ్లు మరింత దయనీయస్థితికి చేరాయి. గత ఐదేళ్లలో 138 రోడ్లలో 34 రోడ్ల పనులు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 104 రోడ్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారినట్లైంది. వీటిలో కొన్ని మధ్యలోనే ఆగిపోగా, మరిన్ని అసలు ప్రారంభమే కాలేదు. కనీసం కేంద్రం ఇచ్చిన నిధులతో నైనా వీలైనంత వరకు గ్రామీణ రోడ్లను నిర్మించి ఉంటే గత ఐదేళ్లలో కొంతైనా ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కాంట్రాక్టర్లకు సైతం చెల్లించాల్సిన బిల్లులు అధికార లెక్కల ప్రకారం రూ. 23.66 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది.

జిల్లాలో

గ్రామీణ రోడ్ల పనుల దుస్థితి ఇలా..

- మంజూరైన రోడ్లు : 138
- నిధుల వ్యయం : రూ. 268 కోట్లు
- గత ఐదేళ్లలో ఖర్చు చేసింది : రూ. 92.95 కోట్లు
- పెండింగ్ బిల్లులు : రూ. 23.66 కోట్లు
- ఇంకా ఖర్చు చేయాల్సింది : రూ. 175.05 కోట్లు
- పూర్తయిన రోడ్లు : 34
- మధ్యలో ఆగిపోయిన రోడ్లు : 39
- ప్రారంభమేకాని రోడ్లు : 65

ప్రజలకు తప్పని అవస్థలు

గత ప్రభుత్వ వైఖరితో జిల్లాలో గ్రామీణ రోడ్ల పరిస్థితి దారుణంగా మారింది. ఆయా రహదారులపై ప్రయాణం చేయాలంటే నరకం కనిపిస్తోంది. ప్రధానంగా ఉరవకొండ, రాయదుర్గం, రాప్తాడు, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి పార్టీలు అధికారంలోకి రావడంతో ఇకనైన గ్రామీణ రోడ్ల దశమారుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆశించిన స్థాయిలో పనులు జరగలేదు



జిల్లా వ్యాప్తంగా గత ఐదేళ్లలో పీఐయూ కింద పనులు ఆశించిన స్థాయిలో జరగలేదన్నది వాస్తవమే. రూ.కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట కూడా నిజమే. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు కూడా పనులు చేయలేదు. కొన్ని రోడ్లకైతే టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకురాలేదు. కొత్త ప్రభుత్వానికి సమస్యలు, రోడ్లకు సంబంధించిన సమగ్ర నివేదికను అందజేశాం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పనులను వేగవంతం చేస్తాం.

- కేవీకేవీ ప్రసాద్, పీఆర్ ఎస్ఈ.

మేడం..! మా బిడ్డను వెతికించండి

మంత్రి సవితకు బాధితుల మొర

పెనుకొండ టౌన్, జూలై 19: తమ కుమార్తె షాఫియా(5) కనిపించకుండా పోయి ఏడాది గడచినా ఆచూకీ లభించలేదని, మీరే వెతికించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు బాధితులైన ఖలీల్, రేష్మా దంపతులు మొరపెట్టుకున్నారు. స్థానిక ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో శుక్రవారం మంత్రిని కలిసిన వారు తమ గోడు వెల్లబోసుకున్నారు. గత వైసీపీ పాలనలో పలుమార్లు పోలీసులు, స్థానిక ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోలేదని కన్నీటిపర్యంతమయ్యారు. మంత్రి బాధితులను ఓదార్చుతూ గతంలో చిన్నారి ఆచూకీ కోసం మీడియా ద్వారా గట్టిగా పోరాడామన్నారు. ఈ విషయాన్ని పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ వేగవంతం చేయిస్తానని హామీ ఇచ్చారు. పెనుకొండ దర్గాపేటలో నివాసముంటున్న ఖలీల్, రేష్మా దంపతుల కుమార్తె షాఫియా గత ఏడాది జూన్ 12న ఇంటి బయట ఆడుకుంటుండగా తండ్రి మందలించి ఇంటివద్ద వదిలి వ్యాపారానికి వెళ్లాడు. తర్వాత కొద్దిసేపటికి ఇంటికి వచ్చి చూడగా షాఫియా కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల గాలించారు. చివరకు పోలీసులను ఆశ్రయించడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. గుల్బర్గా, తదితర దర్గాలలో ప్రత్యేక బృందాలు గాలించాయి. ప్రయోజనం లేకపోయింది. ఈక్రమంలో కనీసం టీడీపీ ప్రభుత్వంలోనైన బాధ్యతగా తమ బిడ్డను వెదికిపెడతారేమోనన్న ఆశతో బాధితులు మంత్రి సవిత వద్దకు వచ్చారు.



బాధితులను ఓదార్చుతున్న మంత్రి సవిత



తప్పిపోయిన చిన్నారి షాఫియా (ఫైల్)

విద్యుత్ శాఖ ఎస్ఈగా సంపత్‌కుమార్



అనంతపురంరూరల్, జూలై 19: ఏపీఎస్పీడీసీఎల్ అనంతపురం సర్కిల్ ఎస్ఈగా సంపత్‌కుమార్ నియమితులయ్యారు. ఆమేరకు శుక్రవారం ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు నియమక ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతంలో అనంతపురం ట్రాన్స్‌ఫార్మర్స్, ఆపరేషన్ విభాగాల్లో పని చేశారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఈయనను తెలంగాణకు కేటాయించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తిరిగి ఏపీఎస్పీడీసీఎల్‌కు కేటాయించబడ్డారు. ప్రస్తుతం తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఈఈగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై జిల్లాకు బదిలీ అయ్యారు. ఇక్కడ ఎస్ఈగా పనిచేస్తున్న సురేంద్రను తిరుపతి ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

రానున్న ఐదు రోజుల్లో వర్ష సూచన

వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి

బుక్కరాయసముద్రం, జూలై 19: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో రానున్న ఐదు రోజుల్లో జిల్లాలో తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని రేకలకుంట ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణస్వామి తెలిపారు. పలు చోట్ల గాలులు గంటకు 30-40 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం లేదా ఉరుములుతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముందన్నారు.

చీనీ టన్ను రూ.19వేలు

అనంతపురం రూరల్, జూలై 19: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.13వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 628 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.60

అనంతపురం రూరల్, జూలై 19: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.60తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం 450 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.53, కనిష్ఠ ధర రూ.40 పలికినట్లు ఆయన తెలిపారు.

అథ్లెటిక్ పోటీల్లో జిల్లాకు పతకాలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 19: జాతీయస్థాయి పారా అథ్లెటిక్ పోటీల్లో జిల్లాకు పతకాల పంట పండింది. గత మూడు రోజుల పాటు బెంగళూరులో నిర్వహించిన 13వ జాతీయ జూనియర్-సబ్‌జూనియర్ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు పతకాలు దక్కాయి. లాంగ్‌జంప్‌లో నరేష్ బంగారు పతకం సాధించాడు. షాట్‌పుట్‌లో సుదర్శన్ రజతం, భార్గవకుమార్ కాంస్య పతకాలు సాధించారు. విజేతలను విభిన్నప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ అబ్దుల్‌రసూల్, సమగ్రశిక్షణ కోఆర్డినేటర్ షమా, డీఎస్ఏ చీఫ్‌కోచ్ షఫీ అభినందించారు. ఈ కార్యక్రమంలో శాప్‌కోచ్ మంజుళ, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

25 వరకు డిగ్రీ ప్రవేశాల రిజిస్ట్రేషన్

అనంతపురం సెంట్రల్, జూలై 19: డిగ్రీ కోర్సుల ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ గడువును 25వరకు ప్రభుత్వం పొడిగించింది. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు 29వరకు వెబ్ ఆప్షన్ ద్వారా నచ్చిన కళాశాల, కోర్సులను ఎంపిక చేసుకోవచ్చు. ఆగస్టు 3న సీట్లను కేటాయించి 5నుంచి తరగతులు నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

తొమ్మిది మందిపై రౌడీషీట్

హిందూపురం, జూలై 19: పట్టణానికి చెందిన కార్తీక్‌పై దాడి చేసిన కేసుకు సంబంధించి వైసీపీ జిల్లా యువజన అధ్యక్షుడు వాల్మీకి లోకేష్‌తోపాటు తొమ్మిది మందిపై రౌడీషీట్ నమోదు చేసినట్లు డీఎస్పీ కంజక్షన్ తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 5న రాత్రి పట్టణంలోని వీడిరోడ్డులో కార్తీక్ ఉండగా దాడిచేశారు. అప్పట్లో ఎమ్మెల్సీగా ఉన్న షేక్ మహ్మద్ ఇక్బాల్ వైసీపీకి రాజీనామా చేశారు. దీంతో హర్షం వ్యక్తం చేస్తూ కార్తీక్ టపాసులు పేల్చాడు. అయితే ఇక్బాల్‌కు మద్దతు పలుకుతావా అంటూ వైసీపీ జిల్లా యువజన అధ్యక్షుడు వాల్మీకి లోకేష్‌తోపాటు అమర్నాథ్‌రెడ్డి, హోటల్ సుధీర్, సాయికిరణ్‌గౌడ్, శేక్షా, హరేంద్రనాథ్, మధుసూదన్, భాస్కర్, తిరుమలేష్‌పై కేసు నమోదుచేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో దీన్ని ఎన్నికల సంఘం సీరియస్‌గా పరిగణించింది. వెంటనే కేసు నమోదుచేసి వారిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ నేపథ్యంలో మేలోనే తొమ్మిది మందిపై రౌడీషీట్ తెరిచినట్లు డీఎస్పీ తెలిపారు. కానీ కొంతమంది వైసీపీ నాయకులు నిన్న మొన్న రౌడీషీటు ఓపెన్ చేసినట్లు చెప్పడం సరికాదన్నారు. ఇది పూర్తిగా ఎన్నికల కమిషన్ ఆదేశల మేరకు జరిగిందన్నారు. ఇదిలా ఉంటే చిలమత్తూరు మండలంలో వైసీపీ ఎంపీపీ పురుషోత్తంరెడ్డి పోలింగ్ రోజున పలుచోట్ల వీరంగం సృష్టించాడు. అయినా అతనిపై రౌడీషీట్ ఎందుకు ఓపెన్ చేయలేదని టీడీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు.

తుంగభద్రకు పోటెత్తుతున్న వరద

బొమ్మనహాళ్, జూలై 19: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో తుంగభద్రకు వరదనీరు పోటెత్తుతోంది. ఈక్రమంలోనే గురువారం 1,04,060 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో శుక్రవారం ఉదయానికి 1,08,790 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో జలాశయంలో నీటి నిల్వ 55.972 టీఎంసీలకు చేరింది. తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతాలైన మలెనాడు, శివమొగ్గ, అగుంబె, శృంగేరి, చిక్‌మంగళూరు, వరనాడులలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరదనీరు భారీగా వచ్చి చేరుతోంది.



టీబీ డ్యాంలో చేరుతున్న వరదనీరు

నిరంతరాయంగా తాగునీటిని అందిస్తాం

● నగరపాలిక కమిషనర్ మేఘస్వరూప్


మాట్లాడుతున్న కమిషనర్

అనంతపురం టౌన్, జూలై 19: తాగునీటి పథకాల ద్వారా అంతరాయం లేకుండా తాగునీటి సరఫరాకు తగిన చర్యలు తీసుకుంటామని నగరపాలిక కమిషనర్ మేఘస్వరూప్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీటి పథకం, ఆర్‌డబ్ల్యూఎస్ పథకాలపై ఆయన సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. తొలుత శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీటిపథకాల అమలు, అక్కడ నెలకొన్న సమస్యల గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాగునీటి పథకాల అమలులో ఎన్ని సమస్యలున్నా వాటిని అధిగమిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నీటిని సరఫరా చేయాల్సిందేనని అధికారులకు ఆదేశించారు. ఆయా పథకాల కింద పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి కార్మిక సంఘాల నేతలతో చర్చించి, అందుకు తగిన నిర్ణయాలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈకి సూచించారు. వర్కర్ల జీతాల సమస్యకు సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టాలో ఆలోచించాలన్నారు. సమీక్షలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ హుసేన్ బాషా, జడ్పీ డిప్యూటీ సీఈఓ లలితాబాయి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ వీసీకి అభినందనల వెల్లువ


వీసీని అభినందిస్తున్న టీచింగ్‌స్టాఫ్ అసోసియేషన్ నాయకులు

అనంతపురం సెంట్రల్, జూలై 19: జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ సుదర్శనరావుకు శుక్రవారం అభినందనలు వెల్లువెత్తాయి. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, అధికార ప్రతినిధి లక్ష్మీనరసింహ, రైతు విభాగం కార్యదర్శి రాయల్ మురళీ, యువగళం నాయకులు నవీన్, హేమంత్ కలిసి వీసీకి శుభాకాంక్షలు తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకుని జేఎన్‌టీయూని అభివృద్ధిపథంలో నడిపించేందుకు కృషిచేయాలని వారు వీసీని కోరారు. అలాగే జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల టీచింగ్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు జయలక్ష్మి, సెక్రెటరీ శారద, జాయింట్ సెక్రెటరీ శివకుమార్, ట్రెజరర్ విష్ణువర్దన్‌తోపాటు పలువురు ఉద్యోగులు, సిబ్బంది వీసీకి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.

ఎస్కేయూ వీసీ బాధ్యతల స్వీకరణ


ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీని అభినందిస్తున్న రెక్టార్ వెంకటనాయుడు తదితరులు

ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీగా ప్రొఫెసర్ బి.అనిత బాధ్యతలు స్వీకరించారు. రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ లక్ష్మయ్య, ప్రొఫెసర్‌లు జీవీ రమణ, ప్రభాకర్, మునినారాయణప్ప, పీఆర్వో రామగోపాల్, ఎస్ఈ మధుసూదన్ రెడ్డితోపాటు పలువురు బోధన, బోధనేతర సిబ్బంది అనితను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

శాకంబరిగా అమ్మవారి దర్శనం


అలంకరణలో నిమిషాంబదేవి

అనంతపురం కల్చరల్, జూలై 19: ఆషాఢ శుక్రవారాన్ని పురస్కరించుకుని నగరంలోని వివిధ ఆలయాల్లో అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమంలో అనంతేశ్వరి, అనంతేశ్వరస్వామిలను విశేషంగా అలంకరించి, భక్తుల చేతులమీదుగా సారెను సమర్పించారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు. రామ్‌నగర్ యల్లమ్మ దేవాలయం, చెరువుకట్ట నిమిషాంబదేవి దేవాలయం, కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయాల్లో అమ్మవార్ల మూలవిరాట్‌లను వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరిగా అలంకరించి పూజాది కైంకర్యాలు నిర్వహించారు.


శివబాలయోగి ఆశ్రమంలో అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

కాశీవిశ్వేశ్వరాలయాన్ని సందర్శించిన గోవిందానంద సరస్వతి స్వామి


కాశీవిశ్వేశ్వరాలయాన్ని సందర్శిస్తున్న గోవిందానంద సరస్వతి స్వామి

అనంతపురం కల్చరల్, జూలై 19: కర్ణాటక రాష్ట్రం తలకాడులోని బా లక్ష్మానంద మహా సంస్థానాధిపతి గోవిందానంద సరస్వతి స్వామి శుక్రవారం జిల్లా కేంద్రంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయాన్ని సందర్శించారు. ఈనెల 21 నుంచి సెప్టెంబరు 18వ తేదీ వరకు చాతుర్మాస దీక్షలు చేపట్టేందుకు శ్రీశైలం వెళ్తున్న స్వామీజీ మార్గమధ్యలో కాశీవిశ్వేశ్వరాలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చక బృందం స్వామీజీకి స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం స్వామీజీ శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, కిశోర్, హర్ష పాల్గొన్నారు.

గురుపౌర్ణమికి ఆలయాలు ముస్తాబు


విద్యుద్దీపాలంకరణలో రామచంద్రనగర్ షిర్డీసాయి ఆలయం

అనంతపురం కల్చరల్, జూలై 19: గురుపౌర్ణమికి సాయినాథుని ఆలయాలు ముస్తాబవుతున్నాయి. 21వ తేదీన నిర్వహించనున్న గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని నిర్వాహకులు ఇప్పటికే ఆలయాలను ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం రామచంద్రనగర్ షిర్డీసాయి ఆలయంతోపాటు ఆలయ పరిసరాలను రకరకాల విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

కేకే పల్లి కాలనీ పంచాయతీ కార్యదర్శిగా హిదయతుల్లా



అనంతపురం రూరల్, జూలై 19: మండలంలోని కక్కలపల్లి కాలనీ పంచాయతీకి గ్రేడ్-1 కార్యదర్శి నియామకం కొన్నేళ్లుగా జరగలేదు. నియమితులైన వారందరూ గ్రేడ్-4 కార్యదర్శులే. దాదాపు మూడేళ్లకుపైగా ఇదే పరిస్థితి. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న కార్యదర్శి లక్ష్మీనారాయణ కూడా గ్రేడ్-4 కార్యదర్శి కావడం గమనార్హం. సదరు అధికారి గత ప్రభుత్వంలో వైసీపీ నియోజకవర్గ ప్రజాప్రతినిధి, వారి కుటుంబ సభ్యులకు ఆటంకాగి పనిచేసినట్లు ఆరోపణలున్నాయి. ఈక్రమంలోనే ఇష్టారాజ్యం బిల్లులు కూడా వారికి చేయడం తెలిసింది. కొన్ని రోజులుగా సెలవులు పెట్టడం వెళ్లడం, తిరిగి మళ్లీ విధులకు హాజరవుతూ వస్తున్నారు. ప్రస్తుతం కూడా మరో వారం రోజులు ఆ అధికారి సెలవులో వెళ్లారు. కక్కలపల్లి క్లస్టర్ గ్రేడ్-1 కార్యదర్శి హిదయతుల్లాను నియమించారు. దీంతో రెండు మూడేళ్ల తర్వాత కక్కలపల్లి కాలనీ పంచాయతీకి గ్రేడ్-1 కార్యదర్శిని నియమించినట్లయింది. ఈక్రమంలోనే సదరు అధికారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

మేడమ్.. మీ ఆఫీస్‌లోనూ చెత్తే..!

● డీఎంహెచ్ఓ కార్యాలయంలో పేరుకుపోయిన చెత్త
● పట్టించుకోని అధికారులు


నీరుగంటి వీధిలో పరిశుభ్రతను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ ఈబీ దేవి

అనంతపురం టౌన్, జూలై 19: ఒకరికి మనం చెప్పేటపుడు, మనం కాస్తోకూస్తో ఆదర్శంగా ఉంటూ వాటిని పాటించాల్సి ఉంటుంది. అప్పుడే మనం చెప్పేవాటిని ఎదుటివారు పాటిస్తారు. అలాకాకుండా మనం ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తూ ఇతరులకు నీతిసూత్రాలు చెబితే అందరూ చులకనచేస్తూ నవ్వుతారు. ప్రస్తుతం జిల్లా వైద్యశాఖ పరిస్థితి అలాగే కనిపిస్తోంది. సీజనల్ వ్యాధుల కాలం. జిల్లాలో అనేక ప్రాంతాల్లో అతిసార, డెంగీ, వైరల్ ఫీవర్ల బారినపడి జనం ఇబ్బంది పడుతున్నారు. టీడీపీ ప్రభుత్వం, సీఎం చంద్రబాబు, మంత్రులు, రాష్ట్ర ఉన్నతాధికారులతో పాటు కలెక్టర్ సైతం ఈ వ్యాధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే దాదాపుగా సీజనల్ వ్యాధులను దూరం చేయవచ్చని, వైద్యశాఖ దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. శుక్రవారం డ్రైడేగా పరిగణిస్తూ శుభ్రత కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం నగరంలోని నీరుగంటి వీధిలో పరిసరాల పరిశుభ్రత పరిశీలనకు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి వెళ్లి స్వయంగా పరిశీలిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. అలాంటప్పుడు వైద్యశాఖ ఎంతో ఆదర్శంగా ఉండాలి. కానీ ఇందుకు విరుద్ధంగా ఆ కార్యాలయం కనిపించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. డీఎంహెచ్ఓ కార్యాలయంలోని రెండో అంతస్తులో ఓ మూలన చెత్తను కుప్పగా వేశారు. ఇక్కడ మరో విషయం ఏమిటంటే ఇదే అంతస్తులో జిల్లా మలేరియా నివారణ అధికారి ఉన్నారు. ఈయనే సీజనల్ వ్యాధులను పర్యవేక్షించడం, నివారణకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఇంకోవైపు అవగాహన కల్పించే మాస్ మీడియా విభాగం, వైరల్ ఫీవర్స్ నిర్ధారణ చేసే ల్యాబ్ గది ఉన్నాయి. కానీ ఇక్కడే చెత్తకుప్ప ఉండడం చూస్తే వీరు సీజనల్ వ్యాధుల నివారణకు ఎంత చిత్తశుద్ధితో పనిచేస్తున్నారో అర్థమవుతోంది. ఆచెత్తచూసినోళ్లందరూ ఇదేమి వైద్యశాఖ బాబోయ్ అంటూ మాట్లాడుకోవడం కనిపించింది.


డీఎంహెచ్ఓ కార్యాలయం రెండో అంతస్తులో ఓ మూలన చెత్త

అంతర్జాతీయ క్రీడాకారుడికి అభినందనలు


బాస్కెట్‌బాల్ క్రీడాకారుడిని అభినందిస్తున్న తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

అనంతపురం క్లాక్ టవర్, జూలై 19: అంతర్జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు ద్వారకనాథ్‌రెడ్డికి జేసీ ప్రభాకర్‌రెడ్డి, జేసీ అస్మిత్‌రెడ్డి అభినందించారు. ఇటీవల శ్రీలంకలో నిర్వహించిన ఏషియన్ బాస్కెట్‌బాల్ పోటీలకు భారతజట్టు తరపున ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారుడు ద్వారకనాథ్‌రెడ్డిని తాడిపత్రిలోని వారి నివాసంలో పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు. ద్వారకనాథ్‌రెడ్డి అంతర్జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయమని కొనియాడారు.

క్రియాశీలక సభ్యత్వాన్ని దిగ్విజయం చేద్దాం

గార్లదిన్నె, జూలై 19: జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని దిగ్విజయం చేద్దామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దివే క్రిష్ణమూర్తి పిలుపునిచ్చారు. శుక్రవారం గార్లదిన్నెలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. జనసేన జిల్లా కమిటీ సభ్యులు దేవనం సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులు మాదలం రఘువేంద్ర, మారుతి, తేజ, పవన్ కుమార్ పాల్గొన్నారు.

రేపు రాతిదూలం లాగుడు పోటీలు

గార్లదిన్నె, జూలై 19: గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని స్థానిక ఇందిరమ్మ కాలనీలో ఆదివారం జిల్లాస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు షిర్డీసాయి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వారు మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన విజేతలకు రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి గల వృషభాల యాజమానులు ఆదివారం ఉదయం 10 గంటలలోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురంరూరల్, జూలై 19: విద్యుత్‌లైన్ల మరమ్మతులో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ టౌన్-1 డీఈఈ నాగేంద్ర తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు అశోక్‌నగర్, హరిహర నగర్, డ్రైవర్స్ కాలనీ, హౌసింగ్ బోర్డు, జీసెస్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

టీటీడీ చైర్మన్ పదవి దళితులకు కేటాయించాలి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 19: టీటీడీ, శ్రీశైలం బోర్డు చైర్మన్ పదవులు దళితులకు కేటాయించాలని ఎస్సీ ఎస్టీ ప్రజాసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మద్దెలచెరువు మల్లి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమీపంలోని ఎస్సీ ఎస్టీ ప్రజాసమాఖ్య కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రముఖ దేవాలయాల చరిత్రలో ఇప్పటి వరకు దళిత, గిరిజనులకు కేటాయించిన చరిత్ర లేదన్నారు. ఇప్పటికీ గ్రామాల్లో దళిత, గిరిజనులకు దేవాలయాలలో ప్రవేశం లేదన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం స్పందించి చైర్మన్ల పదవులు కేటాయించి చరిత్ర తిరగరాయాలన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్, జిల్లా అధ్యక్షుడు పెద్దిరాజు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

అనంతపురంరూరల్, జూలై 19: మండలంలోని కురుగుంట అంగన్‌వాడీ కేంద్రాన్ని స్థానిక టీడీపీ నాయకులు శుక్రవారం సందర్శించారు. అంగన్ వాడీ కేంద్రంలోని నిత్యావసరాలను పరిశీలించారు. సరుకుల నాణ్యత, పంపిణీపై కేంద్రానికి వచ్చిన వారిని అడిగితెలుసుకున్నారు. అనంతరం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు విజయ్‌కుమార్, మైనార్టీ నాయకులు జాఫర్ వలి, ధర్మేంద్ర పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

శింగనమల, జూలై 19: ఖరీఫ్ సీజన్ సంబంధించి రైతులకు పెట్టుబడి సాయం ప్రభుత్వం వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తరిమెల భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం తరిమెల సచివాలయంలో కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అధికారులకు రైతుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. సుంకన్న, ఎర్రిస్వామి, కుళ్లాయిస్వామి, ఆంజనేయులు, ఓబిలేసు పాల్గొన్నారు.

గ్రీన్ ఇండియాకు కృషి చేయాలి


మొక్క నాటుతున్న ఏజీఎం, ప్రిన్సిపాల్

అనంతపురం విద్య, జూలై 19: దేశంలో ప్రతి ఒక్కరూ గ్రీన్ ఇండియా కోసం కృషిచేయాలని ఏజీఎం సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న శ్రీచైతన్య స్కూల్ ఆవరణలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా క్లీన్ ఇండియా-గ్రీన్ ఇండియా కార్యక్రమం నిర్వహించారు. 300 మంది విద్యార్థులతో తో స్కూల్ వద్ద ర్యాలీ చేశారు. అనంతరం ఏజీఎం హాజరై మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ నేత్రావతి, కోఆర్డినేటర్ శ్రీనివాసులు, డీన్ అరుణ్ కిరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైనేజీని శుభ్రం చేయిస్తాం

రాప్తాడు, జూలై 19: పూడిపోయిన డ్రైనేజీలను శుభ్రం చేయిస్తామని టీడీపీ సర్పంచ్ సాకే తిరుపాలు, పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని రామినేపల్లి ఎస్సీ కాలనీలో డ్రైనేజీని పరిశీలించారు. గ్రామస్థులు రాము, కదరయ్య పాల్గొన్నారు.

అడిగోపుల మరణం.. సాహితీలోకానికి తీరనిలోటు

అనంతపురం కల్చరల్, జూలై 19: సుప్రసిద్ధ కవి అడిగోపుల వెంకటరత్నం మరణం సాహితీ లోకానికి తీరని లోటని అనంత సాహితీవేత్తలు అన్నారు. ఈమేరకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, విమలాశాంతి సాహిత్య సామాజిక సాంస్కృతిక సేవా సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ శాంతినారాయణ, ఎస్కేయూ తెలుగు శాఖ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నానీల నాగేంద్ర, డాక్టర్ తస్నీరు నాగేంద్ర, పూజారి ఈరన్న, ఉప్పరపాటి వెంకటేశులు, నిమ్మల ప్రసాద్ శుక్రవారం సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. అడిగోపుల వెంకటరత్నం ప్రజాస్వామ్య కవి అని, మానవతా ఆరాధకుడని కొనియాడారు.

నిబద్ధతకు మారుపేరు లక్ష్మన్న

అనంతపురం విద్య, జూలై 19: సీపీఐ సీనియర్ నాయకులు, ఎస్టీయూ నాయకుడు లక్ష్మన్న నిబద్ధతకు మారుపేరని, ఆయన మరణం తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లక్ష్మన్న ఉపాధ్యాయులుగా, ఎస్టీయూ లీడర్, సీపీఐ నాయకులుగా నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేశారన్నారు. కుందుర్పి మండలంలో సీపీఐ ఉన్నతికి ఎంతగానో కృషి చేశారన్నారు. అనారోగ్యంతో ఆయన మరణించడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయుడు లక్ష్మన్న మృతి బాధాకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పేర్కొన్నారు. లక్ష్మన్న మృతిపై ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధానకార్యదర్శి రామాంజనేయులు, జిల్లా ఆర్థిక కార్యదర్శి ప్రసాద్, అదనపు ప్రధాన కార్యదర్శి సూర్యుడు, కార్యదర్శి చంద్రశేఖర్ సంతాపం తెలిపారు.

కోడలిని వేధించిన కేసులో మూడేళ్ల జైలు

అనంతపురం క్రైం, జూలై 19: కోడలిని వేధించిన కేసులో అత్త, మరొకరికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ అనంతపురం నాలుగో ఏడీజే కోర్టు తీర్పు వెలువరించింది. తాడిపత్రి మండలం యర్రగుంటపల్లికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డితో ప్రత్యూషకు వివాహమైంది. పెళ్లి సందర్భంలో రూ.3 లక్షల నగదు, 16 తులాల బంగారు నగలు కట్నంగా ముట్టజెప్పారు. వీరి సంసారం మూడేళ్లు సాఫీగానే సాగింది. అనంతరం భర్త విదేశాలకు వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అత్త లక్ష్మీదేవి, ఈమెతో సహజీవనం చేస్తున్న నాగర్జున ప్రత్యూషను వేధింపులకు గురి చేశారు. రూ.2లక్షలు అదనపు కట్నం తేవాలని ఒత్తిడి చేస్తూ వచ్చారు. దీనిపై 2017లో ప్రత్యూష ఫిర్యాదు చేయడంతో తాడిపత్రి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ రామచంద్రారెడ్డి కేసు నమోదు చేయగా ఎస్ఐ శివప్ప దర్యాప్తు చేపట్టి కోర్టుకు చార్జిషీటు దాఖలు చేశారు. అన్ని కోణాల్లో విచారించిన అనంతపురం ఏడీజే కోర్టు న్యాయాధికారి శోభారాణి నిందితులిద్దరికీ మూడేళ్ల జైలు శిక్ష, కొంత జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఏసీపీ సుజన, దర్యాప్తు అధికారులను, కోర్టు లైజన్ ఆఫీసర్ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ సారెడ్డిలను ఎస్పీ మురళీకృష్ణ అభినందించారు.

సబ్జెక్టుపై పట్టుసాధిస్తేనే మెరుగైన అవకాశాలు

● జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ సత్యనారాయణ

అనంతపురం సెంట్రల్, జూలై 19: విద్యార్థులు ఎంచుకున్న సెబ్జెక్టులపై పట్టు సాధిస్తేనే భవిష్యత్తులో మెరుగైన అవకాశాలను సొంతం చేసుకోగలరని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఫ్యాకల్టీ, విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బీటెక్ పూర్తిచేసిన విద్యార్థులు అనేక రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారని తెలిపారు. ఐఐటీలో ఎంటెక్, రీసెర్చ్‌తోపాటు ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, డిఫెన్స్ వంటి ఉద్యోగాలు సాధించవచ్చని సూచించారు. అనంతరం పూర్వపు విద్యార్థి ప్రసాద్. కళాశాల అభివృద్ధి, పేటెంట్స్, రీసెర్చ్ పబ్లికేషన్స్ తదితర అంశాలపై ఫ్యాకల్టీకి వివరించారు. శనివారం పలు అంశాలపై సెమినార్ సాగనుంది. మాజీ ప్రొఫెసర్ శంకర్, విభాగాధిపతులు మమత, రామశేఖర్‌రెడ్డి, భవన విజయ, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు రైతయ్య, నాగభూషణం, మానస, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ: కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థి రఘోత్తమరావు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ పుస్తకాలను వితరణచేశారు. తన కుమార్తె సింధు ప్రస్తుతం బెంగళూరులోని ఐటీసీ సంస్థలో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తోంది. ఆమె అభ్యసించిన పుస్తకాలు విద్యార్థులకు ఉపయోగపడతాయని ప్రిన్సిపాల్ సత్యనారాయణకు అందజేశమన్నారు.

ఘనంగా మొహరం

అనంతపురం కల్చరల్, జూలై 19: నగర శివారులోని చిన్మయ నగర్‌లో శుక్రవారం మొహరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీర్ల మకానంలోని హజరత్ అంగార్‌వలీ, ఇమామ్ ఖాసీం సాహెబ్ పీర్లను పూవులతో నయనానందకరంగా అలంకరించి, పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు చక్కెర చదిరామగిరి:మండలంలోని పెనుబోలు, మాదాపురం, ఎంసీపల్లి గ్రామాలలో మొహరం ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో పీర్లస్వాములను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు చక్కెర చదివింపులుచేశారు. అనంతరం ఆయా గ్రామాలలో పీర్లస్వాములు జలదీకి తరలివెళ్లాయి.ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తునిర్వహించారు.


అనంతపురం మూడో రోడ్డులో జలధికి వెళుతున్న అసేన్, ఉసేన్ పీర్లు

ధర్మవరం రూరల్(కనగానపల్లి): మండలంలోని మామిళ్లపల్లి గ్రా మంలో మొహరం ఉత్సవాల్లో భాగం గా జలధి మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. గ్రామంలోని పీర్లస్వాములు ఉదయం అగ్నిగుండ ప్రవేశం చేసి జలధికి వెళ్లాయి. అధికసంఖ్యలో భక్తులు హాజరై స్వామివార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.


చిన్మయానగర్‌లో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు


మామిళ్లపల్లిలో జలధికి వెళుతున్న పీర్లు

శిల్పారామానికి పూర్వవైభవం తెస్తాం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్


మ్యూజికల్ వాటర్ ఫౌంటేన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

అనంతపురం రూరల్, జూలై 19: శిల్పారామానికి పూర్వ వైభవం తీసుకొస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఉదయం రాజీవ్‌కాలనీ పంచాయతీలోని శిల్పారామాన్ని ఆయన పరిశీలించారు. సంబంధిత అధికారులతో కలియతిరిగారు. పార్కులోని ప్రతి ఒక్కటి పరిశీలించారు. టాయిలెట్లు, నీటి సౌకర్యం లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..హైదరాబాదులోని శిల్పారామానికి మించి ఇక్కడ ఉందన్నారు. కానీ కేవలం టీడీపీ అభివృద్ధి చేసిందన్న ఒకే ఒక్క కారణంతో గత ప్రభుత్వం దీనిని నిర్లక్ష్యం చేసిందన్నారు. ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఎమ్మెల్యే ఇక్కడికి వచ్చి పరిశీలించిన పాపాన పోలేదన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసినవన్నీ నాశనం చేశారన్నారు. సీఎం చంద్రబాబును కలిసి శిల్పారామం అభివృద్ధికి నిధులు తీసుకొస్తామన్నారు. శిల్పారామం ఏఓ క్రిష్ణప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, జిల్లా ఉపాధ్యక్షుడు డిష్‌నాగరాజు, పార్లమెంట్ కోఆర్డినేటర్ కూచి హరి, జడ్పీ మాజీ చైర్మన్ చమన్ సాబ్ తనయుడు ఉమర్, నాయకులు రాయల్ మధు, హరిప్రసాద్, లింగమయ్యస్వామి, రాజేంద్ర, కాటమయ్య, సాధిక్, శోభ, శశికళ, అశోక్, ప్రభాకర్, బాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరిస్తాం

● ఎస్పీ మురళీకృష్ణకు ఎంపీ, ఎమ్మెల్యేల శుభాకాంక్షలు



ఎస్పీని కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు

అనంతపురం అర్బన్, జూలై 19: శాంతిభద్రతల పరిరక్షణకు తమవంతు సహకారం అందిస్తామని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నూతన ఎస్పీ మురళీకృష్ణను ఎంపీ, ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువ కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డీఐజీ షిమోషిని వారు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, కూచి హరి, జనసేన నాయకుడు ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఆరెకటికలను గుర్తించండి


మంత్రిని సవితమ్మను సన్మానిస్తున్న ఆరెకటిక సంఘం నాయకులు

అనంతపురం ప్రెస్ క్లబ్, జూలై 19: ఆర్థికంగా, రాజకీయంగా అన్ని విధాలుగా వెనుకబడిన ఆరెకటికలను గుర్తించి న్యాయం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కటిక బాబ్జీ బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను కోరారు. శుక్రవారం పెనుకొండలోని మంత్రి స్వగృహంలో కలిసిన నాయకులు ఆమెకు ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని అందజేసి శాలువాలతో సత్కరించారు. బాబ్జీ మాట్లాడుతూ బీసీ-డీ కేటగిరిలో ఉన్న ఆరెకటికలు ఆర్థిక, రాజకీయంగా అభివృద్ధి చెందలేదన్నారు. తమను రాజకీయంగా గుర్తించి నామినేటెడ్ పదవులైన మాంసాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ పదవులు కేటాయించి న్యాయం చేయాలని కోరారు. సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాజేష్ ఖన్నా, అయ్యప్ప, ప్రసన్నకుమార్, సుధీర్ పాల్గొన్నారు.

లిఖిత్ కుమార్‌కు ఐఐటీలో సీటు



అనంతపురం విద్య, జూలై 19: ఐఐటీ సివిల్ ఇంజనీరింగ్‌లో తన కుమారుడు లిఖిత్ కుమార్ సీటు పొందినట్టు దళిత ఉద్యమ నేత ఎగ్గడి మల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన కుమారుడు ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్‌లో 10565 ర్యాంకు సాధించాడన్నారు. పాండిచ్చేరిలోని పాండిచ్చేరి టెక్నలాజికల్ యూనివర్సిటీలో సివిల్ ఇంజనీరింగ్ సీటు పొందాడని తెలిపారు.

వాహన దొంగలను పట్టించుకోని పోలీసులు

అనంతపురం క్రైం, జూలై 19: తన స్కార్పియో వాహనాన్ని దొంగలెత్తుకెళ్లారని, సంబంధిత రాప్తాడు పోలీసులు పట్టించుకోలేదని ఓ బాధితుడు జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణకు ఫిర్యాదు చేశాడు. కిషోర్‌కుమార్ అనే వ్యక్తి రాప్తాడు మండలం హంపాపురం సమీపంలోని జాతీయ రహదారిలో ఓ రెస్టారెంట్ నిర్వహిస్తున్నాడు. ఈనెల 9వ తేదీ తెల్లవారుజామున రెస్టారెంట్ ఎదుట ఉంచిన అతని స్కార్పియో వాహనాన్ని అపహరించారు. దీనిపై రాప్తాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కానీ ఇప్పటివరకు పోలీసులు స్పందించలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో శుక్రవారం జిల్లా ఎస్పీని కలిసి సమస్య వివరించాడు. ఇందుకు ఎస్పీ స్పందించి, సమస్యను పరిష్కరించాలని సంబంధిత పోలీసులను ఆదేశించారు.

వ్యక్తి అరెస్టు

అనంతపురం క్రైం,జూలై 19: ఓ మతాన్ని కించపరుస్తూ సోషల్‌మీడియో పోస్టులు పెట్టిన వ్యక్తిపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంలోని రెండో రోడ్డుకు చెందిన దర్శన్ ఓ మతాన్ని కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడని పలువురు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు పోలీసులు నమోదు చేశారు. మరోసారి ఎవరైనా ఇలాంటి పనులు చేస్తే కఠిన చర్యలు తప్పవని త్రీటౌన్ సీఐ ధరణికిషోర్ హెచ్చరించారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

అనంతపురం రూరల్ మండలంలో నివాసముంటున్న ఓ డిగ్రీ విద్యార్థిని అదృశ్యమైంది. విద్యారణ్యనగర్‌కు చెందిన తస్లీం అనే యువతి డిగ్రీ పూర్తి చేసింది. శుక్రవారం మధ్యాహ్నం నగరంలోని మాంగళ్య షోరూంలో ఇంటర్వ్యూ ఉందని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. ఫోన్ చేస్తే స్విచ్చాఫ్ వచ్చింది. రాత్రయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్లలో ఆరా తీశారు. ప్రయోజనం లేకపోవడంతో శుక్రవారం అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పామిడి, జూలై 19 : మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరవ్వాలని కోరారు.

పేర్లు నమోదు చేసుకోండి

గుంతకల్లుటౌన్,జూలై19: సబ్సిడీ విత్తన కందుల కోసం రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ కేస్వామి శుక్రవారం ప్రకటనలో సూచించారు. రైతు సేవా కేంద్రాలలో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 6కేజీల బ్యాగు పూర్తి ధర రూ. 559.20లు ఉందని, అయితే సబ్సిడీ కింద రూ. 391.44లకే పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

28న సచివాలయ ఉద్యోగుల సదస్సు

కూడేరు, జూలై 19: జిల్లాకేంద్రంలో ఈ నెల 28న ఏపీ ప్రభుత్వ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే సదస్సుకు సచివాలయ ఉద్యోగులు తరలిరావాలని సచివాయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. కూడేరులో శుక్రవారం ఆయన సచివాయల ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. అనంతపురంలో జరిగే సదస్సుకు ఉద్యోగులందరూ హాజరుకావాలని కోరారు.

మహిళ ఆత్మహత్య

తాడిపత్రి, జూలై19: మండలంలోని గన్నెవారిపల్లికాలనీకి చెందిన ఈశ్వరమ్మ (28) అనే మహిళ శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. ఈశ్వరమ్మ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేది. భర్త దానయ్య ఏ పని చేయకుండా మద్యం తాగుతుండేవాడు. తాగేందుకు డబ్బులు ఇవ్వాలని భార్యను తరచూ వేధిస్తుండేవాడు. దీంతో జీవితంపై విరక్తిచెందిన ఆమె ఇంటిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి సంతానం లేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైలుకిందపడి యువకుడు..

తాడిపత్రి: పట్టణ సమీపంలోని పుట్లూరురైల్వేగేట్ వద్ద శుక్రవారం రైలుకిందపడి యువకుడు శివకుమార్ (23) ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. పట్టణంలోని టైలర్స్‌కాలనీకి చెందిన ఆంజనేయులు, సుమతి దంపతుల కుమారుడు శివకుమార్ గుంటూరు సెల్ఫ్‌లు తయారుచేస్తూ జీవనం సాగించేవాడు. వ్యాపారానికి అధికంగా అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ..

గుంతకల్లుటౌన్: పట్టణంలో ఓ వ్యక్తి గురువారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని 60 అడుగుల రోడ్డు, 7వ క్రాస్‌లో నివాసముంటున్న మహమ్మద్‌రఫీ(35) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా కొన్ని నెలల క్రితం అతను బైక్‌పై నుంచి పడి గాయపడ్డాడు. అప్పటి నుంచి లారీ డ్రైవింగ్‌కి కూడా వెళ్లడం లేదు. దీనికి తోడు కొద్దిరోజుల నుంచి భార్యతో తరచూ గొడవ జరుగుతోంది. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. కొద్దిసేపటికి గమనించిన భార్య బాను, స్థానికులు వెంటనే అతడిని కిందకు దింపి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. అతడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వెన్నపూసపల్లిలో స్వల్పఘర్షణ

యల్లనూరు, జూలై19: మండలంలోని వెన్నపూసపల్లిగ్రామంలో శుక్రవారం సాయంత్రం స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. స్థానిక ఎస్సీ కాలనీలో పాతకక్షలు దృష్టిలో ఉంచుకొని శ్యాముల్ అనే వ్యక్తి రవిపై దాడిచేశాడు. దీంతో రవికి స్వల్పగాయాలయ్యాయి. రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం గ్రామానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. బాధితుడి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో జడ్పీటీసీ మాజీ సభ్యుడి మృతి

పుట్లూరు, జూలై19: మండలంలోని కడవకల్లు గ్రామానికి చెందిన జడ్పీటీసీ మాజీ సభ్యుడు కేసీ నారాయణ (78) అనారోగ్యంతో మృతిచెందారు. ఈయన 1999 లో కాంగ్రెస్ తరపున జడ్పీటీసీగా గెలుపొందారు. మృతి విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకులు నాగేశ్వరరెడ్డి, పెద్దయ్య వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.


ప్రజాభిప్రాయ సేకరణ

పెద్దవడుగూరు, జూలై19: మండలంలోని కిష్టిపాడు సమీపంలో ఉన్న సర్వేనెంబరు 7లో రామ్మోహన్‌రావు అనే వ్యక్తి భూగర్భంలో డోలమైట్ ఖనిజాన్ని వెలికి తీయడంపై శుక్రవారం ఆర్డీఓ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పర్యావరణ పరిరక్షణ అధికారి కిషోర్‌రెడ్డి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. కొందరు ప్రజలు ముడిఖనిజాన్ని వెలికి తీసే క్రమంలో వచ్చే దుమ్ము పంటపొలాలపై పడడం వల్ల దిగుబడులు తగ్గుతున్నాయన్నారు. ప్రజల అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషారాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

యాడికి, జూలై19: మండలకేంద్రంలో గడ్డివామి దగ్ధమైంది. బాధిత రైతు నారాయణరెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పాడిపశువుల కోసం వేరుశనగ పొట్టు, జొన్నచొప్ప, వరిగడ్డిని కలిపి వాము వేశామన్నారు. అయితే శుక్రవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని, దీంతో వామి మొత్తం కాలిపోయిందని, రూ.2లక్షల మేర నష్టం వాటిల్లిందని వాపోయారు. సీఐ నాగార్జునరెడ్డి బాధిత రైతుతో వివరాలు ఆరాతీశారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

కమ్యూనిస్టు యోధుడు లక్ష్మన్న కన్నుమూత



లక్ష్మన్న (ఫైల్)

కుందుర్పి, జూలై 19: కమ్యూనిస్టు పార్టీ, దాని అనుబంధ సంస్థల నిర్మాణంలో తనదైన ముద్ర వేసుకున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, ఎస్టీయూ రాష్ట్రస్థాయి నాయకుడిగా గుర్తింపు పొందిన లక్ష్మన్న (93) కన్ను మూశారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో స్వగ్రామం కుందుర్పిలోని తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు. లక్ష్మన్నకు భార్య పార్వతమ్మ, కుమారుడు రాధాకృష్ణరాజు, కుమార్తెలు అరుణ, విజయలక్ష్మీ, వాణిశ్రీ, శ్యామల కుమారి ఉన్నారు. అంత్యక్రియలు శనివారం ఉదయం కుందుర్పిలో నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సంజీవప్ప తెలిపారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● అధికారులకు ఆర్డీఓ రాణి సుస్మిత సూచన



కళ్యాణదుర్గంలో అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీవో రాణిసుస్మిత

కళ్యాణదుర్గం, జూలై 19 : తుఫాన్ కారణంగా రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురవనున్నాయని, ఈ నేపథ్యంలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ రాణి సుస్మిత సూచించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం ఆమె వివిధ శాఖల మండల అధికారులు, తహసీల్దార్లు మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీడీఓలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విపత్తు నిర్వహణ సంస్థ తెలియజేసిందని, ఈ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి, అందరూ అందుబాటులో ఉండాలన్నారు. శిథిలావస్థ భవనాలను, పాఠశాలలను గుర్తించి ఆ ప్రదేశంలో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని వాగులు, వంకల ప్రవాహ తీవ్రతను ముందుగానే గుర్తించి ఎటువంటి సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. కోతలకు వచ్చిన పంటలను వాయిదా వేసుకునేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. 80 శాతం నిండిన చెరువులు, కుంటలకు గండి ప్రదేశాలను గుర్తించి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు.

రాయదుర్గం రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చిట్టిబాబు పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నాలుగురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. ముఖ్యంగా శిథిలావస్థ భవనాలు, పాఠశాలలను గుర్తించి అక్కడి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల పరిధిలో ఉన్న వాగులు, వంకల వద్ద ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అల్లా బకాష్, విద్యుత్ అధికారి బాలచంద్ర, విద్యాధికారిణి నాగమణి, ఏపీఓ దేవరాజ్, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కణేకల్లు: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఇంద్రాదేవి, ఎంపీడీఓ గూడెన్న వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల్ని అప్రమత్తం చేయాలన్నారు. శిథిలావస్థ ఇళ్లలో నివాసం ఉన్నవారిని గుర్తించి సురక్షిత ఇళ్లకు చేర్చాలన్నారు. అవసరమైతే పాఠశాలలు, సచివాలయాలలో ఆశ్రయం కల్పించాలన్నారు. వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తగు జాగ్రత్తలు అవసరం

యాడికి: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మోహనవల్లి వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అనంతపురం కలెక్టరేట్‌లో జిల్లా కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారని, అత్యవసర పరిస్థితుల వారు 8500292992, 08554-220009కు ఫోన్ చేసి జిల్లా కమాండ్ కంట్రోల్ రూమును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ సావిత్రి, ఎంఈఓ ధనలక్ష్మి, ఏపీఎం చంద్రశేఖర్, వైద్యులు శ్రీరాంకుమార్, దేవరాజ్, ట్రాన్స్‌కో ఏఈ రాజారావు, హౌసింగ్ ఏఈ ప్రశాంత్‌కుమార్, ఆర్ఐ ఆనంద్ బాబుఆచారి పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

గుత్తి: తుఫాన్ కారణంగా రానున్న మూడు రోజుల్లో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ ముస్తాక్ ఆహ్మద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మండలంలో వేరుశనగ, కంది, పత్తి, సజ్జ, ఆముదం పంటలు సాగు చేసి 25నుంచి 30రోజులు కావస్తోందన్నారు. కావున రైతులు పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా కాలువలు చేసి బయటకు పంపే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

రసాభాసగా బహిరంగ సమావేశం

● ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగాయని టీడీపీ నాయకుల మండిపాటు

● బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

కూడేరు, జూలై 19: మండల కేంద్రంలో శుక్రవారం ఉపాధిహామీ తనిఖీ వివరాలు వెల్లడించేందుకు నిర్వహించిన బహిరంగ సమావేశం రసాభాసగా సాగింది. మండల వ్యాప్తంగా 2023 మార్చి నుంచి 2024 జనవరి వరకు వివిధ శాఖల కింద 7, 029, 5,690ల వ్యయంతో జరిగిన ఉపాధి పనులపై ఇటీవల సామాజిక తనిఖీ చేపట్టారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి రూ. 12,19,889ల మేర అక్రమాలు జరిగినట్లు నిర్ధారించారు. ఈ వివరాలను వెల్లడించేందుకు బహిరంగ సమావేశం నిర్వహించారు. ఇందులో కూడేరులో ఇద్దరు చొక్కల నాయకులకు ఉపాధి బిల్లులు చేశారని, అర్హులకు న్యాయం జరగలేదని సర్పంచు లలితమ్మ, స్థానికులు మండిపడ్డారు. అలాగే గొట్కూరు గ్రామంలో అధికారులు వైసీపీ నాయకులు చెప్పినట్లు బిల్లులు చేసి అక్రమాలకు పాల్పడ్డారని టీడీపీ నాయకుడు ప్రతాప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు చేయకుండానే చాలామందికి టెక్నికల్ అసిస్టెంట్ షెక్షావలి బిల్లులు చేశారని, అతడిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఇక కరుట్లపల్లి, నారాయణపురం , జయపురం తదితర గ్రామాల్లో ఉపాధి పనుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. వైసీపీ నాయకుల చెప్పినట్లు ఫీల్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిసెంట్లు అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ప్రజల సమక్షంలో తిరిగి విచారణ చేసి అక్రమార్కుల భరతం పట్టాలని అధికారులను కోరారు. వాటర్‌షెడ్ అడిషనల్ పీడీ సుధాకర్ రెడ్డి, విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఏపీడీ విజయలక్ష్మి, ఎంపీడీఓ విజయలలిత, ఎస్ఆర్పీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జలధికి తరలిన పీర్లు

● ముగిసిన మొహరం వేడుకలు



వేపరాలలో చక్కెర తూకం ఇస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



బెళుగుప్ప మండలం ఆవులెన్నలో జలధికి వెళుతున్న పీర్లు

రాయదుర్గం రూరల్/ బెళుగుప్ప/ కళ్యాణదుర్గం/గుమ్మఘట్ట, జూలై 19: రాయదుర్గం మండలంలోని వేపరాల గ్రామంలో మొహరం వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున ముజావర్లు పీర్లను అగ్నిగుండ ప్రవేశం చేయించి గ్రామపురవీధుల్లో ఊరేగించారు. అనంతరం సాయంత్రం మరొకసారి అగ్నిగుండం ప్రవేశం చేయించి జలధికి తరలించారు. యువత అలావ్ తొక్కి సందడి చేశారు. గ్రామంలో మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొని పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. అలాగే తన బరువు చక్కెరను తూకం వేయించి అందించారు. అనంతరం గ్రామపెద్దలు ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు, నాయకులు వన్నూరప్ప, రాఘవేంద్రగౌడ్, వీరేష్, బుసి తదితరులు ఉన్నారు.

అలాగే బెళుగుప్ప మండలంలోని మండలంలోని ఆవులెన్న, గంగవరం, శ్రీరంగాపురం, గుండ్లపల్లి గ్రామాల్లో, శెట్టూరు మండలంలో కునుకూరు, కైరేవు, చెర్లోపల్లి, మాలేపల్లి, లక్ష్మమ్మపల్లి, మాకొడికి, ములకలేడు, తిప్పనపల్లి, బొచ్చుపల్లి, లింగదీర్లపల్లి గ్రామాల్లో , గుమ్మఘట్ట మండలంలోని కలుగోడు, గలగల, గుమ్మఘట్ట, గోనబావి తదితర గ్రామాల్లో మొహరం వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం రాత్రి భక్తులు మఖానంలోని పీర్లకు పానకాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం ఉదయం ముజావర్లు పీర్లను అగ్నిగుండ ప్రవేశం చేయించి గ్రామంలో ఊరేగించారు. తర్వాత సాయంత్రం మరోసారి అగ్నిగుండ ప్రవేశం చేయించి సమీపంలోని బావి వద్దకు జలధికి తీసుకెళ్లారు. యువత అలావ్ తొక్కి సందడి చేశారు.

మాబు, మౌలాలి పీర్లకు వేలంపాట

యల్లనూరు: మొహరం వేడుకల్లో భాగంగా వెన్నపూసపల్లెలో మాబు, మౌలాలి పీర్లు మోయడానికి శుక్రవారం సాయంత్రం వేలంపాట నిర్వహించారు. మాబు పీరును ఎత్తుకోవడానికి రూ.45వేలు, మౌలాలి పీరును ఎత్తుకోవడానికి రూ.35వేలు పాడారు. అనంతరం గ్రామంలోకి స్వామివారి పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్లారు. వాసాపురం, కూచివారిపల్లి గ్రామాల్లో మస్తాన్ మౌలాలి పీర్లను ఊరేగించి జలధికి తీసుకువెళ్లారు.

పామోలిన్ సాగుపై అవగాహన

డీ.హీరేహాళ్, జూలై 19: రైతులు సుస్థిరమైన నికర ఆదాయాన్ని తెచ్చే పామోలిన్ సాగు చేయాలని పీడీ ఏపీఎంఐపీ రఘునాథ్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని సోమలాపురం గ్రామంలో సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ మొండి మల్లికార్జున అధ్యక్షతన రైతులకు పామోలిన్ సాగుపై అవగాహన కల్పించారు. వంట నూనెకు అవసరమయ్యే పామోలిన్ సాగుకు ప్రభుత్వం సహకారం అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వ సహకారంతో రైతులు పామోలిన్ సాగును చేసి అధిక ఆదాయాన్ని పొందాలని సూచించారు. ఇప్పటికే మన రాష్ట్రంలో 2.27 లక్షల హెక్టార్లలో రైతులు ఆయిల్‌పామ్‌ను సాగు చేస్తున్నారన్నారు. రైతులు ఈ సాగుకు ముందుకు రావాలని కోరారు.

మల్బరీ సాగులో మెలకువలు పాటించాలి

రాయదుర్గంరూరల్, జూలై 19: పట్టు సాగులో సాంకేతిక పరిజ్ఞానంతో మెలకువలను పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని సిరికల్చర్ జాయింట్ డైరెక్టర్, శాస్త్రవేత్త కేపీ కిరణ్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఉషవర్ధిని సూచించారు. పట్టణ సమీపంలోని డ్వామా కార్యాలయంలో శుక్రవారం ఆయన పట్టురైతుల క్షేత్ర దినోత్సవం సందర్భంగా రైతులకు పట్టుసాగుపై అవగాహన కల్పించారు. రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని, మెలకువలను పాటిస్తే పట్టు సాగులో అధిక దిగుబడిని సాధించవచ్చన్నారు. పట్టుపురుగులకు నాణ్యమైన ఆకులు అందించినట్లైతే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. పట్టుపురుగుల పెంపకంలో వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. డివిజన్ పరిధిలో 5802 ఎకరాల్లో మల్బరీ సాగు అవుతున్నట్లు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 40 మంది రైతులకు 32 షెడ్లను ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఓసీ, బీసీలకు 75 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం సబ్సిడీతో పట్టుపురుగుల పెంపక కేంద్ర నిర్మాణషెడ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సిరికల్చర్ అధికారులు ఫిరోజ్‌ఖాన్, ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

కిరాణా దుకాణాల తనిఖీ

యల్లనూరు, జూలై19: మండల కేంద్రంలోని కిరాణాదుకాణాలను తహసీల్దార్ వరప్రసాద్ శుక్రవారం మధ్యాహ్నం తనిఖీచేశారు. ఈ సందర్భంగా వినియోగదారులను సరుకుల ధరలపై ఆరాతీశారు. బియ్యం, కందిపప్పును ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మాలని దుకాణాదారులకు సూచించారు. ఆయన వెంట డీటీ శ్వేత ఉన్నారు.

అందరినీ ఆలోచింపజేస్తున్న ఫ్లెక్సీలు



ఫ్లెక్సీని చూపుతూ మాట్లాడుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, జూలై19: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం బయట అండర్‌డ్రైనేజీ నిర్వహణపై మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు అందరిని ఆలోచింపజేసేలా ఉన్నాయి. ఒక ఫ్లెక్సీపై అండర్‌డ్రైనేజీలో పనులు చేసే కార్మికుల ఫొటోలు చూపిస్తూ ఇలాంటి పనిచేయడానికి ఎవరైనా ఉన్నారా అంటూ దర్శనమిస్తోంది. మరో ఫ్లెక్సీలో అండర్‌డ్రైనేజీ పైప్‌లైన్ స్తంభించి పోవడానికి కారకులు మీరే అంటూ డ్రైనేజీలో వేసిన చెత్తాచెదారాన్ని చూపారు. కౌన్సిల్ మీట్‌కు ముందే కార్యాలయానికి వచ్చిన ఆయన ఫ్లెక్సీలను చూపుతూ ప్రస్తుతం డ్రైనేజీ పనులు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. కాబట్టి వ్యర్థాలను అండర్ డ్రైనేజీలోకి వేయకుండా చూసుకోవాలన్నారు. ఒకవేళ ఎక్కడైనా అండర్‌డ్రైనేజీ పైపులు బ్లాక్ అయితే అక్టోబరు 30నుంచి ఆ పరిధిలోని ఇళ్లవారే చేయించుకోవాల్సి ఉంటుందని, అప్పుడే బాధ్యత తెలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఎక్స్ అఫిషియో సభ్యుడిగా అశ్మిత్ ప్రమాణం

● ప్రమాణం చేయించిన తండ్రి జేసీ ప్రభాకర్ రెడ్డి



అశ్మిత్‌రెడ్డితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి

తాడిపత్రి, జూలై19: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఇందులో ఆయన ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి చేత ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు జేసీ ప్రభాకర్‌రెడ్డితోపాటు టీడీపీ కౌన్సిలర్లు శాలువాలు కప్పి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ కౌన్సిలర్ల తరపున ఫయాజ్‌బాషా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ పలు అంశాలను చదివి వినిపించారు. వీటిలో దినసరి కూరగాయల మార్కెట్‌లో సైకిల్ స్టాండ్, రోడ్డుమార్జిన్, శనివారపు సంత వసూళ్లు తదితర వాటిని కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్, వైస్‌చైర్మన్లు సరస్వతి, అబ్దుల్‌రహీం, కౌన్సిలర్లు విజయ్‌కుమార్, జింకా లక్ష్మీదేవి, రేష్మాపర్వీన్, మల్లికార్జున, షెక్షావలి, అరుణ, రంగనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆషాఢ మాస పూజలు



తాడిపత్రిలో శాకంబరీదేవిగా అంబాభవాని

పామిడి, జూలై 19: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఆషాఢ మాస పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మణిదీప వర్ణన పూజ చేపట్టారు. తొమ్మిదిమార్లు 33 రకాల పూలతో ఈ పూజలు చేశారు. అలాగే వాసవి, లలిత అష్టోత్తర పూజలు, కుంకుమార్చన జరిపారు. వాసవి మాతృ మండలి వారు ఆషాఢ మాస గోరింటాకు ఉత్సవాలు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

యాడికి: ఆషాఢ మాసం సందర్భంగా మండలకేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పలు పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

శాకంబరీదేవిగా అంబాభవాని

తాడిపత్రి: పట్టణంలోని అంబాభవాని ఆలయంలో అమ్మవారు శాకంబరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని 30రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించి పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు దర్శించుకున్నారు.

వ్యసనాల జోలికి వెళ్లరాదు: డీఎస్పీ



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

రాయదుర్గం రూరల్, జూలై 19: విద్యార్థులు చెడు వ్యసనాల జోలికి వెళ్లరాదని, మంచి ఆలోచనలు కలిగి ఉండి ఉన్నత స్థాయికి ఎదగాలని కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మత్తు పదార్థాల వాడకం వల్ల జరిగే అనర్థాలపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఎస్పీ శ్రీనివాసులు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకూడదన్నారు. ముఖ్యంగా మత్తు పదార్థాలైన గుట్కా, సిగరెట్లు, గంజాయి లాంటి వాటి జోలికి వెళ్లరాదన్నారు. బాగా చదువుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని తెలిపారు. క్రమశిక్షణతో చదివాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విఠోబాస్వామికి హనుమద్ వాహన సేవ



హనుమద్ వాహనంపై ఊరేగుతున్న విఠోబాస్వామి

పామిడి, జూలై 19 : పట్టణంలోని రంగసుబేపేర్కా భగవాన్ దాస్ విఠోబాస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ మేరకు శుక్రవారం అర్చకులు స్వామివారి మూల విరాట్‌కు అభిషేకములు, విశేష అలంకరణలు, అర్చనలు, హోమాలు, పూర్ణాహుతి తదితర పూజలు చేపట్టారు. తర్వాత ప్రత్యేకంగా అలంకరించిన హనుమద్ వాహనంపై ఉత్సవమూర్తిని కొలువుదీర్చి పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. ఊరేగింపులో భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చున్నారు. సాయంత్రం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో ఈఓ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రేమజంటకు వివాహం

డీ.హీరేహాళ్, జూలై 19: మండలకేంద్రంలో శుక్రవారం ఓ ప్రేమజంటకు పోలీసులు, స్త్రీశిశు సంక్షేమ శాఖ అధికారులు వివాహం జరిపించారు. మండలంలోని హనుమాపురం గ్రామానికి చెందిన 22 ఏళ్ల యువతి పెళ్లి కాకుండానే గర్భం దాల్చింది. పురిటినొప్పులతో రాయదుర్గం ప్రభుత్వాసుపత్రిలో చేరి గత మంగళవారం ఆడబిడ్డకు జన్మిచ్చింది. విషయం ప్రభుత్వాధికారుల దృష్టికి రావడంతో పోలీసులు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు ఆసుపత్రి వద్దకు వెళ్లి విషయంపై ఆరా తీశారు. అదే గ్రామానికి చెందిన యువకుడిని ప్రేమించానని, అతడి వల్ల గర్భం దాల్చానని, పెళ్లి విషయమై పలుమార్లు అతడితో ప్రస్తావించానని, ఇదిగో అదిగో అంటూ ప్రసవం జరిగే సమయానికి కనిపించకుండా పోయాడని ఆమె తెలిపింది. దీంతో ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, ఐసీడీఎస్ అధికారులు ఆ యువతి కుటుంబసభ్యుల పెద్దల సహకారంతో ఆ యువకుడి కుటుంబసభ్యులతో చర్చించారు. ఆ వెంటనే అతడిని పిలుచుకొచ్చి రాయదుర్గం సమీపంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆమెతో వివాహం చేశారు.

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం

గుత్తి,జూలై19: పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం జనసేన జిల్లా కార్యదర్శి వాసగిరి మణికంఠ పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మొబైల్ యాప్‌లో సభ్యత్వ నమోదు చేస్తున్నామన్నారు. కార్యకర్తలకు ఏదైనా ప్రమాదం జరిగితే అండగా ఉండేందుకు ప్రమాద బీమా రూ.5లక్షలు, ఆరోగ్యబీమా రూ.50వేలు ఇచ్చేవిధంగా పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు చిన్న వెంకటేశులు, పాటిల్ సురేష్, ప్రధాన కార్యదర్శి బోయగడ్డ బ్రహ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం

గుత్తి రూరల్, జూలై 19: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ విశాలక్షి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో శ్రీపురం, లచ్చానిపల్లి, యంగన్నపల్లి సర్పంచులు భరత్, రామలింగమయ్య, గోపాల్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో నెలకొన్ని సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎంపీడీఓ శివాజీరెడ్డి, సర్పంచులు రమేష్ నాయుడు, వెంకటేష్, ఎంపీటీసీలు జింకల నారాయణస్వామి, ధనుంజయ, ఈరన్న,పంచాయితీ కార్యదర్శులు, వివిద శాఖ అధికారులు పాల్గొన్నారు.

రేపు గురుపౌర్ణమి

బెళుగుప్ప, జూలై 19 : మండలంలోని నక్కలపల్లి, బెళుగుప్పలోని షిర్డీ సాయిబాబా ఆలయాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామస్థులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, భజనలు జరపనున్నామన్నారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. నక్కలపల్లిలో రాత్రి 9 గంటల నుంచి రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు మొదటి బహుమతి కింద రూ. 25 వేలు, రెండో బహుమతి రూ. 20 వేలు, మూడో బహుమతి కింద రూ. 16 వేలు నగదు అందిస్తామన్నారు. ప్రవేశ రుసుము రూ. 300లు చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

బీజేపీలోకి డేరంగుల ఉదయ్‌కిరణ్

గుంతకల్లుటౌన్,జూలై19: పట్టణానికి చెందిన బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు వైసీపీ నాయకుడు డేరంగుల ఉదయ్‌కిరణ్ బీజేపీలో చేరారు. విజయవాడలో పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన అనంతపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

కోడలిని వేధించిన కేసులో మూడేళ్ల జైలు

అనంతపురం క్రైం,జూలై 19: కోడలిని వేధించిన కేసులో అత్త, మరొకరికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ అనంతపురం నాలుగో ఏడీజే కోర్టు తీర్పు వెలువరించింది. తాడిపత్రి మండలం యర్రగుంటపల్లికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డితో ప్రత్యూషకు వివాహమైంది. పెళ్లిలో రూ.3లక్షల నగదు, 16 తులాల బంగారం కట్నంగా ముట్టజెప్పారు. వీరి సంసారం మూడేళ్లు సాఫీగానే సాగింది. అనంతరం భర్త విదేశాలకు వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అత్త లక్ష్మీదేవి, ఈమెతో సహజీవనం చేస్తున్న నాగర్జున ప్రత్యూషను వేధింపులకు గురి చేశారు. రూ.2లక్షలు అదనపు కట్నం తేవాలని ఒత్తిడి చేస్తూ వచ్చారు. దీనిపై 2017లో ప్రత్యూష ఫిర్యాదు చేయడంతో తాడిపత్రి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అన్ని కోణాల్లో విచారించిన అనంతపురం ఏడీజే కోర్టు న్యాయాధికారి శోభారాణి నిందితులిద్దరికీ మూడేళ్ల జైలు శిక్ష, కొంత జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.